జాతీయ తెలుగు దినపత్రిక
NIZAMABAD EDITION
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED
గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జిలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.
ప్రజాజ్యోతి
సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528


నిజామాబాద్ | బుధవారం 1 జూలై 2026 | సంపుటి : 16 | సంచిక : 141 | పేజీలు : 8 | వెల : 1/- | RNI No. TELTEL/2010/35558

శ్రీ పరాభవ నామ సంవత్సరం, జ్యేష్ఠ మాసం, గ్రీష్మ ఋతువు, ఉత్తరాయణం విశేషం: కుసుమహారా జయంతి సూర్యోదయం: 5:30 । సూర్యాస్తమయం: 6:32 చంద్రోదయం: 7:44 । చంద్రాస్తమయం: 6:21 తిథి: బహుళ పాడ్యమి ఉ. 6:08 వరకు, తదుపరి విదియ నక్షత్రం: పూర్వాషాఢ ఉ. 6:15 వరకు, తదుపరి ఉత్తరాషాఢ యోగం: ఇంద్రం సా. 4:06 వరకు, తదుపరి వైధృతి కరణం: కౌలవ ఉ. 6:08 వరకు, తదుపరి తైతుల రా. 6:55 వరకు, తదుపరి గరజ

Published from : NIZAMABAD, WARANGAL, RANGAREDDY, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

# రెండు ఎకరాలకే పరిమితం

## కోటలు దాటుతోన్న రేవంత్ రెడ్డి మాటలు
## పథకాల అమలులో చేతులెత్తేస్తోన్న కాంగ్రెస్
## పెట్టుబడి సాయం అమలులో తీవ్ర వైఫల్యం
## మిగిలిన ఎకరాలకు పెట్టుబడి సాయం కష్టమే?




**నిజామాబాద్**


రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం రోజుకో విధంగా మోసం చేస్తోంది. పెట్టుబడి సాయం ఎకరానికి ఏటా రూ.15వేలు అందిస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చింది. గద్దెనెక్కిన తర్వాత రైతుభరోసా పథకాన్ని అమలు చేయడంలో అడుగడుగునా వైఫల్యం చెందుతోంది. ఏ సీజన్‌లో ఎన్ని ఎకరాలకు పెట్టుబడి సాయం వస్తుందో? అర్థం కాక రైతులు తలలు పట్టుకుంటున్నారు. గత యాసంగి సీజన్‌లో నేడు, రేపు అంటూ లీకులు ఇచ్చి, రైతులను మభ్యపెట్టి మే నెలలో పెట్టుబడి సాయం నగదును అందించారు. అందరి కాకుండా కొందరికే రెండు విడుతల్లో కేవలం 2 ఎకరాల భూములకే రైతుభరోసా పరిమితం చేశారు. మిగిలిన భూ విస్తీర్ణానికి రైతుభరోసా అందిస్తామని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి చెప్పినప్పటికీ అమలు కాలేదు. అంతలోనే వానాకాలం సీజన్ మొదలై నెల గడుస్తోంది. పెట్టుబడి ఖర్చుల కోసం కర్షకులు ఎదురు చూస్తుండగా నగదు సాయం పేరుతో మరోసారి మోసాలకు కాంగ్రెస్ ప్రభుత్వం తెర లేపింది. హైదరాబాద్‌లో మంగళవారం పెట్టుబడి సాయం నిధులు విడుదల చేసినప్పటికీ కేవలం 2 ఎకరాలకే పరిమితం చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కేసీఆర్ పాలనలో ఠంచనుగా రైతుబంధు పథకం అమలైంది. కోతలు పెట్టకుండానే నగదు జమ చేశారు. కానిప్పుడు రేవంత్ రెడ్డి పూటకో విధంగా రైతుభరోసా పథకం ఉద్దేశాన్ని, స్కీమ్ రూపాన్ని మార్చేస్తుండడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**10.89లక్షల ఎకరాల సాగు భూములు..**

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో మొత్తం 10లక్షల 89వేల ఎకరాల సాగు భూములున్నాయి. ఒక సీజన్‌లో ఎకరానికి రూ.6వేలు చొప్పున పెట్టుబడి సాయం అందిస్తే ఉభయ జిల్లాలోని 5లక్షల 39వేల 969 మంది రైతులకు దాదాపుగా రూ.653.40 కోట్లు నిధులు అవసరం అవుతుంది. కానీ ప్రతి రైతుకు రెండు ఎకరాలకే ప్రభుత్వం పెట్టుబడి సాయం విడుదల చేయడంతో సర్కారు నిర్ణయం చిన్న, సన్నకారు రైతులకు ఊరట ఇవ్వడం లేదు. నిజామాబాద్ జిల్లాలో 2లక్షల 60వేల 617 మంది రైతులున్నారు. వీరి పరిధిలో దాదాపుగా 5లక్షల 30వేల ఎకరాల్లో పంటలు సాగుకు నోచుకోబోతున్నట్లుగా వ్యవసాయ శాఖ అంచనాలే చెబుతున్నాయి. కామారెడ్డి జిల్లాలో 2లక్షల 79వేల 352 మంది రైతులుంటే వీరి పరిధిలో 5లక్షల 59వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నట్లుగా వ్యవసాయాధికారుల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఐదు పంట కాలాలు వచ్చాయి. ఇందులో పూర్తి స్థాయిలో రైతుభరోసా అందించిన దాఖలాలే లేవు. మధ్యలో రెండు విడుతల్లో పెట్టుబడి సాయం ఎగ్గొట్టారు. ఆ తర్వాత సగం మంది రైతులకు శఠగోపం పెట్టారు. ఇష్టమొచ్చినట్లుగా విస్తీర్ణానికి సంబంధం లేకుండానే నగదు జమ చేశారు. గత యాసంగిలో నమ్మించి నట్టేట ముంచారు. అరకొరగా సాయం చేసి భారీగా ప్రచారం చేసుకుంటుండడంపై రైతులంతా - మిగతా2లో

# ఎన్యూమరేషన్ పత్రాలు.. చేతులు మారుతున్నాయి 'సర్'

## బీఎల్‌వోల నుంచి తీసుకుంటున్న కొందరు ప్రజాప్రతినిధులు



**కామారెడ్డి**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియ జిల్లాలో అక్కడక్కడ గాడి తప్పుతోంది. ఎన్యూమరేషన్ పత్రాలు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్తున్నాయి. దీంతో ప్రక్రియకు ఆటంకం కలుగుతోంది. కొందరు ప్రజాప్రతినిధులు, మాజీలు ఎన్యూమరేషన్ పత్రాలను బీఎల్‌వోల నుంచి తీసుకుంటున్నారు. తామే పత్రాలను పంపిణీ చేస్తామని చెబుతున్నారు. పనిభారం తప్పడంతో కొందరు బీఎల్‌వోలు అందుకు అంగీకరిస్తున్నారు. ముఖ్యంగా మున్సిపాలిటీల్లోని కొందరు కౌన్సిలర్లు, పల్లెల్లో కొందరు వార్డు సభ్యులు ఎన్యూమరేషన్ పత్రాలను తీసుకుంటున్నారు. వారే ఇంటింటా తిరిగి ఓటర్లకు పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో 4.28 లక్షల గణన పత్రాలను సోమవారం - మిగతా2లో

# యూరియా.. ఉన్నా లేనట్టు.. నిల్వలు కనికట్టు

జుక్కల్ నియోజకవర్గంలోని ఓ ఎరువుల డీలర్ దగ్గర వందలాది యూరియా బస్తాలు నిల్వ ఉన్నా.. యాప్‌లో మాత్రం బస్తాలు స్టాక్ లేనట్లు చూపిస్తోంది. దీనిపై 'ఈనాడు' పరిశీలన చేయగా.. సదరు ఎరువుల డీలర్ యూరియా బస్తాలను ముందే నిల్వ చేసుకుని ఉంచుకున్నాడని.. రైతులకు అత్యవసర సమయంలో బస్తాపై రూ.200-300 అదనంగా వసూలు చేసి విక్రయిస్తున్నట్లు తేలింది. మాచారెడ్డి సొసైటీలో ఓ అధికారి అవగాహన రాహిత్యంతో 103 యూరియా బస్తాలు - మిగతా2లో



# కాంగ్రెస్ జెండాకు ఎస్సై సెల్యూట్

- చిక్కుల్లో పడ్డ గాంధారి సబ్ ఇన్‌స్పెక్టర్
- సోషల్ మీడియాలో ఫొటో వైరల్
- ఎస్సై మహేందర్ తీరుపై తీవ్ర విమర్శలు
- పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల్లా మారారన్న వేముల
- సస్పెండ్ చేయాలని జాజాల డిమాండ్





**ఎల్లారెడ్డి**

కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో కాంగ్రెస్ జెండాకు సెల్యూట్ చేసిన గాంధారి ఎస్సై మహేందర్ తీరు ఉమ్మడి జిల్లాలోనే కాదు, రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. గాంధారిలో అధికార పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన జెండాకు సెల్యూట్ చేస్తున్న ఫొటో మంగళవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల్లా మారారన్న ఆరోపణలకు తాజా ఉదంతం మరింత బలం చేకూర్చింది. ఈ నేపథ్యంలో పోలీసుల వ్యవహార శైలిపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలేం జరిగిందంటే.. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్, డీసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఆధ్వర్యంలో సోమవారం గాంధారిలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆఫీసు ఆవరణలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు జెండాకు వందనం చేసిన సమయంలో అక్కడే ఉన్న ఎస్సై మహేందర్ కూడా జెండాకు వందనం చేశారు. ఈ ఫొటో కాస్త మంగళవారం బయటకు వచ్చింది. సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసుల పనితీరుపై - మిగతా2లో

# యూరియా.. ఉన్నా లేనట్టు.. నిల్వలు కనికట్టు

-మొదటిపేజీ తరువాయి

మాయం కావడం చర్చనీయాంశమైంది. ఆన్‌లైన్‌లో స్టాక్ ఉందని యూరియా బుక్ చేసుకున్న రైతులు బస్తాల కోసం సొసైటీకి వెళ్లగా స్టాక్ అయిపోయిందని నిర్వాహకులు చెప్పడం వివాదానికి దారి తీసింది. అధికారి అవగాహన రాహిత్యంతో యూరియా పక్కదారి పట్టిందని ఉన్నతాధికారులు చేతులు దులుపుకొన్నా.. దీని వెనుక కొందరి హస్తముందనే ఆరోపణలు వ్యక్తమవుతుండటం గమనార్హం. జిల్లాలో యూరియా పక్కదారి పడుతోంది. కొందరు ప్రైవేటు డీలర్ల దగ్గర వందలాది బస్తాలు నిల్వ ఉన్నా.. యాప్‌లో మాత్రం స్టాక్ ఉన్నట్లు చూపించడం లేదు. వ్యవసాయ సొసైటీల ద్వారా ప్రభుత్వమే యూరియా పంపిణీ చేస్తున్నా.. అధికారుల అవగాహన రాహిత్యంతో యాప్‌తో సంబంధం లేకుండా బస్తాలు మాయం అవుతుండటంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**గతంలో మూడు.. ఇప్పుడు రెండే..**

అధికారులు మొదట్లో ఎకరాకు మూడు యూరియా బస్తాల చొప్పున అందించారు. ప్రస్తుతం ఆ కోటాను రెండు బస్తాలకు కుదించారు. రాష్ట్ర ప్రభుత్వమే కోటాను తగ్గించిందని అధికారులు చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో రైతులకు ఇది శాపంగా మారింది. మొదట్లో తీసుకున్న రైతులకు మూడు బస్తాలు అందగా.. ఇప్పుడిప్పుడే పంటలు సాగు చేస్తున్న రైతులకు యూరియా తగ్గడంతో మిగిలిన అవసరాల కోసం ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించి బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నట్లు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారులు దృష్టి సారిస్తేనే..**

జిల్లాలో యూరియా పంపిణీలో జరుగుతున్న అవకతవకలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. మొదట్లో యాప్‌పై అవగాహన కొరవడి స్టాక్ సమాచారం లేక అన్నదాతలు ఇబ్బందిపడ్డారు. ప్రస్తుతం సొసైటీ అధికారుల తప్పిదాలు, ప్రైవేటు డీలర్ల మాయాజాలంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. యూరియా విక్రయాలపై నిఘా ఉంచామని ఉన్నతాధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అది కనిపించడం లేదు. ఎరువుల దుకాణాలను తనిఖీ చేయడానికి ఉన్నతాధికారులు వస్తున్న సమాచారాన్ని ఇంటి దొంగలే డీలర్లకు చేరవేసిన సందర్భాలు సైతం ఇటీవల వెలుగు చూడటం వ్యవసాయ శాఖలో లోపాలను ఎత్తిచూపుతోంది. మాచారెడ్డి పీఏసీఎస్‌లో పనిచేస్తున్న అధికారి అవగాహనరాహిత్యంతో యూరియా యాప్‌తో సంబంధం లేకుండా 103 బస్తాలను వేరే రైతులకు ఇవ్వడం జరిగింది. దీనిపై విచారించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటున్నాం. సదరు రైతులకు ఇబ్బంది లేకుండా యూరియా అందించాం.

# కరవు పెత్తనం.. వేసేదెలా విత్తనం?



**కామారెడ్డి :** జిల్లాలో పచ్చదనంతో కళకళలాడాల్సిన పంట భూములు బీడు వారి వెక్కిరిస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన మేర వర్షాలు లేవు. వర్షం కురుస్తుందో లేదోనని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. విత్తనాలను విత్తకుండా ఇంట్లో దాచుకున్నారు. కరవు పెత్తనం కొనసాగుతున్న నేపథ్యంలో విత్తనం వేయాలా వద్దా అనేది ప్రశ్నార్థకంగా మారింది. హలధారులు కాడి కదపడానికి.. నేలలో కర్రు దించడానికి సాహసించని వైనంపై 'న్యూస్‌టుడే' కథనం.

**ఇప్పటికీ 10 వేల ఎకరాల్లోనే..**

జిల్లాలో గతేడాది వానాకాలంలో 5,52,832 ఎకరాల్లో పంటలు సాగు చేయగా.. ఈ సారి 5,59,290 ఎకరాల్లో పంటలు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనాలు రూపొందించారు. గత ఏడాది వానాకాలం సీజన్‌లో జూన్ చివరి నాటికి జిల్లాలో 1,44,462 ఎకరాల్లో వివిధ రకాలైన పంటలు సాగు చేశారు. ప్రస్తుత సీజన్‌లో మాత్రం ఇప్పటి వరకు కేవలం 10,819 ఎకరాల్లో మాత్రమే పంటలను సాగు చేయడం ఆందోళన కలిగిస్తోంది.

**సగటున 19 శాతం లోటు వర్షపాతం**

జిల్లాలో వర్షపాతం లోటు కొనసాగుతోంది. అప్పుడప్పుడు వర్షాలు కురుస్తున్నా.. కరవు తీరా వాన పడడం లేదు. జిల్లావ్యాప్తంగా మంగళవారం వరకు సగటున 19 శాతం వర్షపాతం లోటు నెలకొంది. మద్నూర్, పెద్దకొడపగల్, బాన్సువాడ, పిట్లం, నిజాంసాగర్, ఎల్లారెడ్డి, గాంధారి, రాజంపేట, మాచారెడ్డి, బీబీపేట, డోంగ్లి, మహ్మద్‌నగర్ మండలాల్లో 23–52 శాతం లోటుతో దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. నాగిరెడ్డిపేట, లింగంపేట మండలాల్లో 61–69 శాతం లోటు వర్షపాతంతో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. 'నీటి తడులు తక్కువగా అవసరమయ్యే పప్పుదినుసుల పంటలను రైతులు సాగు చేయాలి. సంబంధిత విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.' అని డీఏవో మోహన్‌రెడ్డి అన్నారు.

# నీరు నిల్వ.. కానరాని కాల్వ

'కామారెడ్డి జిల్లాకేంద్రంలోని స్టేషన్ రోడ్డులో పక్కా మురుగు నీటి వ్యవస్థ లేక సమస్య ఎదురవుతోంది. చిన్నపాటి వానకే రోడ్డుపై నీరు నిలుస్తోంది. ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో స్థానికంగా ఉన్న చిరువ్యాపారులు ఇబ్బందుల పాలవుతున్నారు. వాన నీరు నిలిస్తే దుకాణాలు మూసి వేస్తున్నారు. అసలే అద్దెల భారం.. ఆపై వ్యాపారాలకు నష్టం వాటిల్లుతోందని స్థానికులు పేర్కొన్నారు.' 'కామారెడ్డి'.. పేరుకే జిల్లాకేంద్రం. కానీ ప్రధాన ప్రాంతాల్లో కనీస వసతుల కల్పనలో యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోంది. ఏ రోడ్డు చూసినా వాన నీరు నిలుస్తోంది. మురుగు, వరద నీటి కాల్వలు లేక వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాలకులు మారినా ప్రగతిలో మార్పు కానరావడం లేదు. జిల్లాకేంద్రంలో 'న్యూస్‌టుడే' మంగళవారం పరిశీలన చేయగా లోపాలు వెలుగుచూశాయి.

**ఎక్కడెక్కడంటే..**

జిల్లాకేంద్రంలో రైల్వేకమాన్ నుంచి ఇందిరాచౌక్ వరకు కాల్వలు లేవు. దీంతో చిరు వానకే నీరు నిలిచి మడుగులా మారుతోంది. స్టేషన్ రోడ్డు ప్రాంతంలో 90 మడిగెలు ఉన్నాయి. ఇక్కడ పక్కా కాల్వలు నిర్మించలేదు. గతంలో ఇక్కడ కాల్వల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేసినా చివరకు పనులు చేపట్టలేదు.

నిజాంసాగర్ చౌరస్తా నుంచి పాత జాతీయరహదారి మీదుగా హౌసింగ్ బోర్డు కాలనీ వరకు కాల్వలు లేవు. గతంలో కొత్తబస్టాండు ప్రాంతం నుంచి పురపాలక కార్యాలయం వరకు కాల్వలు నిర్మించారు. ఈ నిర్మాణాలు అస్పష్టంగా చేపట్టడంతో ఇరుకుగా మారింది. దీంతో నీరు రోడ్లపైకి వస్తోంది.

జిల్లాకేంద్రంలోని ధర్మశాల నుంచి సైలన్‌బాబాకాలనీ వరకు ఇటీవల తారు రోడ్లు నిర్మించారు. ఇరువైపులా మురుగు కాల్వలు నిర్మించాల్సి ఉన్నా చర్యలు కరవయ్యాయి. గతంలో నిర్మించిన కాల్వలు కొన్ని చోట్ల ధ్వంసమయ్యాయి.

వాసవీనగర్, ఉపాధ్యాయకాలనీ, గాంధీనగర్, అయ్యప్పనగర్ ప్రాంతాల్లో ఏళ్ల నాటి మురుగు కాల్వలతో సమస్య నెలకొంది.

జిల్లాకేంద్రంలో మురుగు కాల్వల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని బల్దియా కార్యాలయంలో అధికారులకు వినతులు వస్తున్నాయి. కొత్త కాలనీల్లో కాల్వలు లేక మురుగు నీటిని ఖాళీ స్థలాల్లోకి వదులుతున్నారు. దీంతో అపారిశుద్ధ్య సమస్య నెలకొంటోంది.

# రెండు ఎకరాలకే పరిమితం

-మొదటిపేజీ తరువాయి

ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

**మోసం మీద మోసం..**

కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనలో రైతులకు మోసం మీద మోసమే ఎదురవుతోంది. ప్రతి పంట కాలంలో దెబ్బ మీద దెబ్బ అన్నట్లుగా దుస్థితి ఏర్పడింది. యూరియా కోసం క్యూలైన్‌లలో నిలబడి, యాప్‌తో కష్టాలు పడి సాధించాల్సి వస్తోంది. మూడు విడుతల్లో వచ్చే యూరియా సంచుల కోసం పొలాలను వదిలి ఎరువుల దుకాణాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. సాగుకు నీళ్లు లేవు. కాలువలు బీడు బారుతున్నాయి. వర్షాభావ పరిస్థితుల నుంచి రైతులను ఆదుకునే ఆలోచన రేవంత్ రెడ్డి సర్కారు చేయడం లేదు. వానాకాలంలో వర్షాలపైనే రైతులంతా ఆధారపడ్డారు. ఎల్‌నినో ప్రభావంతో వానలు మొఖం చాటేస్తున్నాయి. లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను మూలకు పడేయడంతో రైతులకు వరుణ దేవుడు మినహా కాంగ్రెస్ సర్కారు ఆదుకోవడం కష్టంగానే దాపురించింది. ఇన్ని కష్టాల మధ్య కొట్టుమిట్టాడుతున్న రైతుకు పెట్టుబడు సాయం సరిగా ఇవ్వడం లేదు. ఎట్టకేలకు సీజన్ ప్రారంభమైన నెల రోజులకు నిధులు విడుదల చేసినప్పటికీ కేవలం 2 ఎకరాలకే నగదు జమ చేయడంపై మండిపడుతున్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో చిన్న కమతాల్లోనే వ్యవసాయం చేస్తోన్న బడుగు, బలహీన వర్గాలకు చెందిన రైతులే అధిక శాతం మంది ఉన్నారు. వీరి చేతుల్లో గరిష్టంగా 5 ఎకరాల్లోపు భూములు ఉన్నాయి. కేవలం 2 ఎకరాలకే పెట్టుబడి సాయం ఇస్తే మిగిలిన వాటికి ఎప్పుడు ఇస్తారో? తెలియక అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు.

# ఎన్యూమరేషన్ పత్రాలు.. చేతులు మారుతున్నాయి 'సర్'

-మొదటిపేజీ తరువాయి

వరకు పంపిణీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే పట్టణాల్లో చాలా చోట్ల కౌన్సిలర్లే పత్రాలను పంపిణీ చేస్తున్నారు. దీంతో కొన్ని కాలనీల్లో ఓటర్లు అభ్యంతరం చెబుతున్నారు. బీఎల్‌వోలు ఉండగా ప్రజాప్రతినిధులు ఎందుకు పంపిణీ చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. 'అదేమిటి..? మీరు కదా ఎన్యూమరేషన్ పత్రాలు ఇవ్వాల్సింది' అంటే.. కౌన్సిలరే మీ ఇంటికి వచ్చి పత్రాలు ఇస్తామని చెప్పాడని ఫోన్లో బీఎల్‌వోలు సమాధానం చెబుతున్నారు. దీంతో ఓటర్లు ఆందోళన చెందుతున్నారు. సర్ సర్వేలో ప్రజాప్రతినిధుల ప్రమేయం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

**అవగాహన కరవు**

సర్ ప్రక్రియలో బీఎల్‌వోలకు రెండుమూడు మార్లు శిక్షణ ఇచ్చారు. ఎన్యూమరేషన్ పత్రాలను పూరించే విధానంలో అవగాహన కల్పించారు. అయితే క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలకు సరైన అవగాహన ఉండడం లేదు. కొందరు ఒక రకంగా మరికొందరు మరో రకంగా ఓటర్లను గందరగోళానికి గురి చేస్తున్నారు. గణనపత్రాలను ఎలా పూరించాలని అడిగితే కొందరు బీఎల్‌వోలు సరైన విధంగా సమాధానాలు చెప్పడం లేదు.

**గిట్టని వారికి ఇవ్వడం లేదా..?**

పట్టణాల్లో ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ 50 శాతం కూడా దాటలేదు. కొన్నిచోట్ల పంపిణీ ప్రక్రియను కొందరు కౌన్సిలర్లు తీసుకోవడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడుతోంది. గత ఎన్నికల్లో కౌన్సిలర్లకు వ్యతిరేకంగా పనిచేసిన తమకు గణనపత్రం ఇవ్వడంలేదని కొందరు ఆరోపిస్తున్నారు. మరికొన్ని చోట్ల మాజీలు, ఓటమి పాలైన అధికార పక్షం నేతలు కూడా గణన పత్రాలను పంపిణీ చేస్తున్నట్లు తెలుస్తోంది. వీరిలో చాలా మంది వారికి అనుకూలంగా ఉండే ఓటర్లకే పత్రాలు అందజేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంలో అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఓటర్లు విజ్ఞప్తి చేస్తున్నారు. చాలా చోట్ల బీఎల్‌వోలు గుర్తింపుకార్డులు ధరించకుండానే విధులు నిర్వహిస్తున్నారు.

**కౌన్సిలర్‌ను కలవండి.. ఆయనే ఇస్తారు**

కామారెడ్డి పట్టణంలో కొందరు ఓటర్లు తమకు ఇంకా ఎన్యూమరేషన్ పత్రాలు రాకపోవడంతో వారి ప్రాంతానికి చెందిన బీఎల్‌వోను ఫోన్‌లో సంప్రదిస్తున్నారు. తమకు గణన పత్రాలు ఇంకా ఇంటికి రాలేదని అడుగుతున్నారు. దీంతో సదరు బీఎల్‌వో నుంచి ఊహించని సమాధానాలు ఎదురవుతున్నాయి. మీరు మీ కౌన్సిలర్ ఇంటికి వెళ్లి గణన పత్రాలు తీసుకోవాలని సమాధానం చెబుతున్నారు.

# కాంగ్రెస్ జెండాకు ఎస్సై సెల్యూట్

-మొదటిపేజీ తరువాయి

విమర్శలు వెల్లువెత్తాయి.

**కాంగ్రెస్ జేబు సంస్థగా పోలీసు వ్యవస్థ**

రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ కాంగ్రెస్ పార్టీ జేబు సంస్థగా మారిందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. పోలీసులు కాంగ్రెస్ పార్టీ కార్యర్తల్లా వ్యవహరిస్తున్నారనేందుకు గాంధారిలో జరిగిన ఘటననే నిదర్శనమన్నారు. ఈ ఘటనపై డీజీపీ వెంటనే విచారణ జరిపి, ఎస్సై మహేందర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ తాబేదార్లుగా పని చేస్తున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా విధులు నిర్వహించాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు అధికార పార్టీ కార్యకర్తల్లా వ్యవహరించే పరిస్థితికి కాంగ్రెస్ సర్కారు తీసుకొచ్చిందని మండిపడ్డారు. గాంధారిలో ఎమ్మెల్యే కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించిన సందర్భంగా ఎస్సై మహేందర్ జెండావందనం తీవ్ర అభ్యంతరకరమన్నారు. రాజకీయాలకు దూరంగా ఉండాల్సిన పోలీసు అధికారి రాజకీయ పార్టీ జెండాకు సెల్యూట్ చేయడం, కాంగ్రెస్ పార్టీ పోలీస్ వ్యవస్థను వారికి అనుకూలంగా మలచుకొని ఎంతగా నిర్వీర్యం చేసిందో స్పష్టం అవుతుందన్నారు. ఇటువంటి చర్యలు పోలీసు వ్యవస్థ నిష్పాక్షికతపై అనుమానాలు కలిగిస్తాయన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, ఇతరులపై అధికార పార్టీ ఆదేశాల మేరకు అక్రమ కేసులు పెడుతున్నారని, పోలీసుల తీరు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కేలా పోలీసులు వ్యవహరించడం బాధాకరమన్నారు.

# ఇసన్నపల్లిలో అదృష్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం



**రామారెడ్డి :** కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం ఇసన్నపల్లి గ్రామంలో జూన్ 8న కందూరి చిన్న మల్లయ్య అనే వ్యక్తి అదృశ్యం కాగా ఆయన మృతదేహం రామారెడ్డి గ్రామ శివారులో మంగళవారం లభ్యమైంది. స్థానిక పోలీసుల కథనం ప్రకారం.. రామారెడ్డి మండలంలోని ఇసన్నపల్లి గ్రామానికి చెందిన కందూరి చిన్న మల్లయ్య (80) అనే వృద్ధుడు జూన్ 8న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కాగా కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్లో జూన్ 12 ఫిర్యాదు చేశారు. కాగా అప్పటి నుండి బంధువులతో పాటు పలు చోట్ల ఎక్కడ వెతికినా అతడి ఆచూకీ లభ్యం కాలేదు. మంగళవారం పశువుల కాపరికి దుర్వాసనతో రావడంతో అక్కడి వెళ్లి చూడగా మతదేహం కనిపించింది. ఆయన గ్రామంలోని పలువురికి తెలపగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్సై రాజశేఖర్, సర్పంచ్ బండి ప్రవీణ్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా కందూరి చిన్న మల్లయ్య మృతదేహంగా నిర్ధారణ జరిగింది. ప్రాథమిక విచారణలో భాగంగా మృతుడు ఉరివేసుకొని మృతి చెందినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి తరలించామని ఎస్ఐ తెలిపారు.

# రేపటిలోగా ఓటర్ల ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి చేయాలి: తహసీల్దార్ జి. బాలయ్య





**ఇందల్వాయి, జూన్ 30(ప్రజా జ్యోతి ):** మండల పరిధిలోని తిర్మన్ పల్లి మరియు ఇందల్వాయి గ్రామాల్లో మంగళవారం ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జి. బాలయ్య మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా నమోదు, సవరణ ప్రక్రియలో భాగంగా ఈ ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లోని అర్హులైన ప్రతి ఓటరుకు ఈ ఫారాలు అందేలా చూడాలని, పంపిణీ ప్రక్రియను రేపటి లోగా వంద శాతం పూర్తి చేయాలని సంబంధిత బూత్ స్థాయి అధికారులను (బీఎల్ఓలు) ఆయన ఆదేశించారు. విధుల్లో ఎలాంటి అలసత్వం వహించకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత గ్రామాల బీఎల్ఓలు, సూపర్వైజర్లు మరియు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బోధన్ ఆర్ డి ఓ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చేతుల మీదుగా పేద మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ...





**ప్రజా జ్యోతి బోధన్ జూన్ 30..** నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని బోధన్ శాసన సభ్యులు సుదర్శన్ రెడ్డి ఈల త్రిపాటి బోధన్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో పలు విషయాలపై చర్చించి అనంతరం పేద మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ కార్యక్రమానికిముఖ్యఅతిథిగా మునిసిపల్ చైర్మన్ తూము పద్మ శరత్ రెడ్డి కౌన్సిలర్ దాము కౌన్సిలర్ ఆదినారాయణ మండల అధ్యక్షులు నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు దాము మరియు ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

# పురపాలక సంఘ కార్యాలయం బోధన్. ప్రత్యేక సమావేశం.

**కో ఆప్షన్ ఎన్నిక కొరకు విచ్చేసిన. జిల్లా కలెక్టర్ ఈల త్రిపాటి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి...**




**ప్రజా జ్యోతి బోధన్ జూన్ 30...** నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని కో ఆప్షన్ ఎన్నిక ప్రత్యేక సమావేశం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి బోధన్ శాసనసభ్యులు సుదర్శన్ రెడ్డి మున్సిపల్ చైర్మన్ తూము పద్మజ శరత్ రెడ్డి మున్సిపల్ కౌన్సిలర్లు హాజరయ్యారు ఈ కార్యక్రమం లో కో ఆప్షన్ సభ్యుల ను ఎన్నుకోవడం జరిగింది కో ఆప్షన్ సభ్యులు ఎన్నిక కలెక్టర్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి గారి సమక్షంలో జరిగింది కో ఆప్షన్ సభ్యులు ఎన్నిక జరగడం ఇదే మొదటిసారి ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి బోధన శాసన సభ్యులు మున్సిపల్ చైర్మన్ పద్మజ శరత్ రెడ్డి కౌన్సిలర్లు ఆదినారాయణ దాము మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో ఇన్సినిరేషన్ ప్రక్రియ ద్వారా 296.31 కిలోల గంజాయి దహనం

గంజాయి సాగు రవాణాపై జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా


2 సంవత్సరాల లో - 414 కేజీల గంజాయి , 2003 గంజాయి మొక్కల దహనం

జిల్లా ఎస్పీ నితికా పంత్,



**కుమురం భీమ్ ఆసిఫాబాద్** జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 57 కేసుల్లో నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న 296.31 కిలోల డ్రై గంజాయి, 964 గంజాయి మొక్కలను జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్‌డీపీఎస్ చట్టంలోని నిబంధనలను అనుసరించి, పర్యావరణ కాలుష్య నియంత్రణ ప్రమాణాలను పాటిస్తూ ఇన్సినిరేషన్ ప్రక్రియ ద్వారా దహనం చేసినట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. వీటి విలువ 1.70 కోట్ల రూపాయలు ఉంటుందని తెలిపారు.గత ఏడాది 53 కేసులకు సంబంధించి 117.856 కిలోల గంజాయి, 1,039 గంజాయి మొక్కలను ఇదే విధానంలో దహనం చేసినట్లు ఎస్పీ తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులకు సంబంధించిన గంజాయిని నిబంధనల మేరకు నిర్మూలించడం జరిగిందన్నారు. కొందరు అక్రమార్జన కోసం గంజాయి సాగు, రవాణా, విక్రయాలకు పాల్పడుతూ యువతను మత్తు పదార్థాల బారిన పడేస్తున్నారని, ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృత స్థాయిలో తనిఖీలు, ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని తెలిపారు.గంజాయి, ఇతర మత్తు పదార్థాల సాగు, రవాణా, విక్రయం లేదా వినియోగానికి పాల్పడిన వారిపై ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీకి జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ చైర్మన్‌గా వ్యవహరించగా, కమిటీ సభ్యులుగా అదనపు ఎస్పీ (అడ్మిన్) చిత్తరంజన్, ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్ ఉన్నారు.ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్, ఇన్‌స్పెక్టర్లు రవీందర్, బాలాజీ వరప్రసాద్, శ్రీనివాస్, వేణుగోపాల్, సబ్ ఇన్‌స్పెక్టర్లు సుధాకర్, మహేందర్, వెంకట కృష్ణ, రవికుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగులకు 2 వేల కోట్లు విడుదల




**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులు, పింఛన్‌దారుల దీర్ఘకాలిక బకాయిల చెల్లింపుల కోసం మరో రూ.2 వేల కోట్లను విడుదల చేస్తూ సర్కార్ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో నెల రోజుల వ్యవధిలోనే ప్రభుత్వం మొత్తం రూ.4 వేల కోట్ల నిధులను ఉద్యోగుల కోసం కేటాయించినట్లయింది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు సంబంధించిన జనరల్ ప్రావిడెంట్ ఫండ్ బకాయిలను వంద శాతం చెల్లించి, పెండింగ్ బిల్లులు లేకుండా చేసినట్లు ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగ జేఏసీకి ఇచ్చిన హామీ మేరకు వంద రోజుల్లో రూ.6 వేల కోట్లు విడుదల చేసే లక్ష్యంలో భాగంగా ఈ నిధులు విడుదలయ్యాయన్నారు.తెలంగాణలోని ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందనే విషయాన్ని స్పష్టం చేస్తూ తెలంగాణ ఆర్థిక శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల, పింఛన్‌దారుల బకాయిల చెల్లింపుల కోసం మరో రెండు వేల కోట్లు విడుదల చేస్తూ ఆర్థిక శాఖ సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల మే 29న మొదటి విడతగా రెండు వేల కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం.. సరిగ్గా నెల రోజుల వ్యవధిలోనే రెండో విడత నిధులను కూడా సర్దుబాటు చేసింది. దీంతో కేవలం నెల రోజుల వ్యవధిలోనే ఉద్యోగ వర్గాల కోసం ప్రభుత్వం విడుదల చేసిన మొత్తం బకాయిల నిధులు నాలుగు వేల కోట్లకు చేరుకున్నాయి. ఉద్యోగ జేఏసీ నాయకులతో గతంలో జరిపిన చర్చల సారాంశం ప్రకారం.. దీర్ఘకాలంగా పేరుకుపోయిన బకాయిలను తీర్చేందుకు వంద రోజుల వ్యవధిలో ఆరు వేల కోట్లను విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ హామీని నిలబెట్టుకునే క్రమంలోనే ఈ నిధుల విడుదల వేగంగా సాగుతోంది.ఈ నిధుల విడుదలపై ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేస్తూ ఉద్యోగుల పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి మరోసారి నిరూపితమైందని పేర్కొన్నారు. రాష్ట్రంలో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు, నిధుల కొరత ఎదుర్కొంటున్నప్పటికీ ఉద్యోగులకు ఇచ్చిన ప్రతి మాటను నెరవేరుస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర రాయితీల బకాయిల చెల్లింపు ప్రక్రియను మరింత వేగవంతం చేశామని వివరించారు. ముఖ్యంగా పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని గుర్తు చేశారు. ఇందులో భాగంగానే రిటైర్డ్ ఉద్యోగులు, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు సంబంధించి చాలా కాలంగా పెండింగులో ఉన్న జనరల్ ప్రావిడెంట్ ఫండ్ బకాయిలను వంద శాతం క్లియర్ చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వ పరిధిలో జీపీఎఫ్ ఖాతాలకు సంబంధించిన ఎలాంటి పెండింగ్ బిల్లులూ లేవని అన్నారు దీంతో పాటు విశ్రాంత ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించి సెప్టెంబరు 2025 వరకు ఉన్న కమ్యూటేషన్ బకాయిలన్నింటినీ ప్రభుత్వం పూర్తిగా చెల్లించినట్లు ఆర్థికశాఖ వివరించింది. ఉద్యోగులు, పింఛన్‌దారులు గతంలో ప్రభుత్వానికి పంపిన పది వేల లోపు ఉన్న చిన్న చిన్న బిల్లులను ప్రత్యేకంగా గుర్తించి అలాంటి దాదాపు ఐదు లక్షలకు పైగా బిల్లులను వంద శాతం పూర్తిగా చెల్లించినట్లు తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై రాష్ట్రంలోని వివిధ ఉద్యోగ సంఘాల నేతలు తీవ్ర సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్నప్పటికీ, ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూల ధోరణితో వ్యవహరించడం అభినందనీయమని కొనియాడారు. రాబోయే రోజుల్లో మిగిలి ఉన్న ఇతర బకాయిలను కూడా ఇదే విధంగా ఒక క్రమపద్ధతిలో విడతల వారీగా చెల్లిస్తామని ఆర్థిక శాఖ అధికారులు తమకు హామీ ఇచ్చారని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు వెల్లడించారు.

# మూడు జిల్లాల్లో వానలే వానలు



**హైదరాబాద్ :** భారత వాతావరణ శాఖ ప్రకారం, తెలంగాణలో మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30-40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే సూచనలున్నాయి. పలు జిల్లాలకు భారీ వర్ష సూచన హెచ్చరికలు జారీ అయ్యాయి.తెలంగాణలో మరో మూడు రోజుల పాటు వర్షాలు కొనసాగే అవకాశముందని భారత వాతావరణ శాఖ (ఎఓఆ), హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో పాటు ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని మంగళవారం విడుదల చేసిన వాతావరణ బులెటిన్‌లో పేర్కొంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. మంగళవారం (జూన్ 30) రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఒకటి లేదా రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అలాగే పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే సూచనలు ఉన్నాయి. ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.జూలై 1, 2 తేదీల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగనుంది. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు విస్తృతంగా కురిసే అవకాశముండగా, కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ రెండు రోజులూ గంటకు 30?40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉండటంతో రైతులు, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు మరింత చురుగ్గా విస్తరిస్తున్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది. జూన్ 30 నాటికి రుతుపవనాలు మధ్యప్రదేశ్‌లోని మరికొన్ని ప్రాంతాలు, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, బీహార్ రాష్ట్రాల మిగిలిన ప్రాంతాలు, ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలు, ఉత్తరాఖండ్‌లోని చాలా ప్రాంతాలు, అలాగే హిమాచల్ ప్రదేశ్, లడఖ్‌లోని కొన్ని ప్రాంతాలకు విస్తరించాయి.రాబోయే రెండు నుంచి మూడు రోజుల్లో గుజరాత్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ-కాశ్మీర్, హర్యానా, ఢిల్లీ, పంజాబ్, రాజస్థాన్‌లోని మరికొన్ని ప్రాంతాలకు కూడా నైరుతి రుతుపవనాలు మరింత ముందుకు సాగే పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు తెలిపింది. ఇదిలా ఉండగా, దక్షిణ మధ్యప్రదేశ్ నుంచి తూర్పు-మధ్య అరేబియా సముద్రం వరకు మరాఠ్వాడా, మధ్య మహారాష్ట్ర, కొంకణ్-గోవా మీదుగా సుమారు 4.5 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతోందని పేర్కొంది. నిన్న ఉత్తర తెలంగాణ పరిసరాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ఈరోజు ఉదయం బలహీనపడినప్పటికీ, రాష్ట్రంలో వర్షాలకు అనుకూల వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

## సిగాచీ బాధితులకు న్యాయం చేయండి

**హైదరాబాద్ :** తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో 2025 జూన్ 30వ తేదీ ఒక చీకటి రోజు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారం సిగాచి పరిశ్రమలో కూలి కోసం వలస వచ్చిన 54 మంది పేద కార్మికులు సజీవదహనమైన ఘోర ఘటనకు ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ నియంత్రణ, పర్యవేక్షణ వైఫల్యం, సిగాచి యాజమాన్య నిర్లక్ష్యం కారణంగా అమాయకులు ప్రాణాలు కోల్పోయారని విమర్శించారు. ఘటన జరిగిన రోజున హైదరాబాద్ జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో ఉన్నా 20 కి.మీ దూరంలోని ఘటన స్థలానికి సీఎం రేవంత్ రాకపోవడం, బాధిత కుటుంబాల కన్నీళ్లు తుడవకపోవడం హృదయవిదారకమన్నారు. విమర్శలు రావడంతో మరుసటి రోజు వచ్చారని విమర్శించారు. రేవంత్ రెడ్డి మృతదేహాల సాక్షిగా ప్రతి కుటుంబానికి రూ.1 కోటి ఇస్తానని ప్రకటించినా, ప్రభుత్వం తరపున కేవలం రూ.1 లక్ష మాత్రమే ఇచ్చింది. కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ, లైఫ్ ఇన్స్యూరెన్స్, వైద్య ఖర్చులను కూడా పరిహారంలో చేర్చి మోసం చేశారని ఆరోపించారు. డెత్ సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పడం, ఉద్యోగాలు ఇవ్వకపోవడం, క్షతగాత్రులకు సహాయం చేయకపోవడం దుర్మార్గమన్నారు.ఈ ఘటన సామూహిక హత్య అని, 818 ఊఖకి అనుమతి తీసుకుని 1777 ఊఖ నడపడం, సేఫ్టీ గార్డ్స్, ఫైర్ ఔూఅ, డస్ట్ కంట్రోల్ వ్యవస్థ లేకపోవడం వంటి నిర్లక్ష్యాలు విచారణలో తేలాయన్నారు. ప్రభుత్వం యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోవడం, ఎండీని అరెస్టు చేసి వెంటనే బెయిల్‌పై విడుదల చేయడం లోపాయికారీ ఒప్పందాన్ని సూచిస్తుందని విమర్శించారు. సిగాచి డైరెక్టర్ల ఆస్తులను అటాచ్ చేసి కోటి రూపాయల పరిహారం తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. “మాట తప్పడం మీకు అలవాటే కానీ, ప్రాణాలు కోల్పోయిన పేద కార్మికుల కుటుంబాలను మోసం చేయవద్దు” అని హరీశ్ రావు వ్యాఖ్యానించారు.

## లంకె బిందల ఆశ...

## అత్తామామల కోసం కూతురు, అల్లుడు ఆత్మహత్య

**హైదరాబాద్ :** ఇంట్లో లంకెబిందెలు, గుప్తనిధులు ఉన్నాయంటూ ఓ సాధువు చెప్పిన మాటలను నమ్మిన అత్తమామలు.. తమ సొంత కూతురు, అల్లుడి ప్రాణాలనే బలితీసుకున్నారు. అల్లుడితో అప్పులు చేయించి.. ఆ తర్వాత మె?హం చాటేయటంతో మనస్థాపం చెందిన దంపతులు ప్రాణాలు తీసుకున్నారు. ఈ విషాదకర ఘటన హైదరాబాద్ శివారు మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మోకిల సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బాలసాయి, పద్మ ఏడాదిన్నర క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. పెళ్లయిన తర్వాత వారిద్దరూ సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు మండలం పటేల్‌గూడలో నివాసముంటూ జీవనం సాగించేవారు. వీరికి ఐదు నెలల బాబు కూడా ఉన్నాడు.అయితే.. పెళ్లయిన కొన్ని రోజులకు ఈ దంపతులు అత్తగారి ఇంటికి వెళ్లారు. అదే సమయంలో పద్మ తల్లిదండ్రులైన శాంతమ్మ, చంద్రయ్య, అలాగే తోడల్లుడు వెంకటేష్ కలిసి బాలసాయికి ఒక కథ చెప్పారు. తమ ఇంట్లో కోట్ల విలువైన నిధి దాగి ఉందని.. దాన్ని వెలికితీయడానికి ఒక సాధువు పూజలు చేయాలని అందుకు రూ.10 లక్షల నగదు అత్యవసరంగా కావాలని అల్లుడు బాలసాయిని నమ్మించారు. అత్తమామల మాటలను నిజమేనని నమ్మిన బాలసాయి.. నాలుగు నెలల క్రితం తనకు తెలిసిన వారి వద్ద వడ్డీలకు రూ.10 లక్షలు అప్పు తెచ్చి అత్తమామల చేతిలో పెట్టాడు.ఆ డబ్బుతో వారు ఇంట్లో రహస్యంగా తవ్వకాలు జరిపారు. అయితే ఎంత తవ్వినా ఎలాంటి నిధి దొరకలేదు. దీంతో సాధువు మోసం చేశాడని తెలిసినా అత్తమామలు ఆ విషయాన్ని దాచిపెట్టారు. ఇటు చూస్తే అప్పు ఇచ్చిన వారు బాలసాయిపై రోజురోజుకూ ఒత్తిడి పెంచడం ప్రారంభించారు. అటు వైపు అత్తమామల నుంచి ఎలాంటి స్పందన లేదు. అవమానాలు, వేధింపులు ఎక్కువ కావడంతో బాలసాయి తన అత్త, మామ, తోడల్లుడిని డబ్బులు తిరిగివ్వాలని కోరాడు. కానీ వారు నయాపైసా కూడా ఇవ్వకుండా చేతులెత్తేశారు.అప్పుల ఊబి నుంచి ఎలా బయటపడాలో దిక్కుతోచని స్థితిలో తీవ్ర మనస్తాపానికి గురైన బాలసాయి, పద్మ తమ ఐదు నెలల పసికందును చూసి కన్నీరుమున్నీరయ్యారు. చివరకు స్వగ్రామమైన జన్వాడకు వచ్చి ఇద్దరూ కలిసి జూన్ 28న బలవన్మరణానికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతుడి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. ‘అందరూ మమ్మల్ని క్షమించాలి. నేను, నా భార్య... మా అత్త, మామల మాటలు నమ్మి దారుణంగా మోసపోయాం.’ అని మెసేజ్ ఉండటంతో ఆ దిశగా దర్యాప్తు ముమ్మరం చేశారు. పోలీసులు అత్త శాంతమ్మ, మామ చంద్రయ్య, తోడల్లుడు వెంకటేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దీంతో ఐదు నెలల చిన్నారి అనాథగా మారాడు.

## ఫడ్నవిస్‌తో పవన్ భేటీ

ముంబై : మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నీవీస్‌తో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమావేశమయ్యారు. ఇద్దరు నేతలు ఇరు రాష్ట్రాల మధ్య పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన కీలకమైన అంశాలపై చర్చించారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు రెండు ఆడ పులులు ఇచ్చే అంశంపై ఇద్దరు చర్చించారు. ఏపీకి రెండు ఆడ పులులు ఇస్తున్నందుకు మహారాష్ట్ర సీఎంకు పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు.ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను కలిశారు. ముంబైలోని మహారాష్ట్ర ముఖ్యమంత్రి వారి క్యాంపు కార్యాలయంలో సమావేశమైన పవన్, ఫడ్నవీస్‌లు.. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. తూర్పు కనుమల్లో పులుల సంరక్షణకు సంబంధించిన అంశాలపై చర్చించారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కి రెండు ఆడపులులను ఇవ్వాలని నిర్ణయం తీసుకోగా.. పవన్ సీఎం ఫడ్నవీస్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో రెండు రాష్ట్రాలకు సంబంధించిన అంశాలలో పరస్పరం మరింత సహకరించుకోవాలని పవన్, ఫడ్నవీస్‌లు నిర్ణయించారు.ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న తూర్పు కనుమలలో ఆడ పులుల సంఖ్య గణనీయంగా తగ్గిందని పవన్ కళ్యాణ్ తెలిపారు. అందుకే పులుల సంఖ్య పునరుద్ధరణ కోసం మహారాష్ట్ర ప్రభుత్వ సహకారం తీసుకున్నామని.. ఏపీకి రెండు ఆడ పులుల్ని ఇచ్చేందుకు అంగీకరించిందని పేర్కొన్నారు. తూర్పు కనుమలలో పులుల సంరక్షణ చరిత్రలో ఇది ఒక మైలురాయిగా నిలిచిపోతుందని అభిప్రాయపడ్డారు. మహారాష్ట్ర నుంచి తీసుకొచ్చే ఆడ పులులు తూర్పు కనుమల్లో ప్రవేశంతో అంతరసంతానోత్పత్తిసమస్యల్ని అధిగమించొచ్చన్నారు. అంతేకాదు జన్యు వైవిధ్యం పెరిగి, పులుల సంఖ్య దీర్ఘకాలిక స్థిరత్వానికి దోహదపడుతుందన్నారు. తూర్పు కనుమలలో పులుల ఆవాస వ్యవస్థ ఏర్పడుతుందన్నారు.మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సంరక్షణ కార్యాచరణ శాస్త్రీయ విధానాలు, స్థిరమైన వన్యప్రాణి నిర్వహణ ఆధారంగా జీవ వైవిధ్య పరిరక్షణకు కట్టుబడి ఉన్న విషయాన్ని ప్రతిబింబిస్తోందన్నారు పవన్ కళ్యాణ్. ‘ఆంధ్రప్రదేశ్?మహారాష్ట్ర రాష్ట్రాల మధ్య ఏర్పడిన ఈ భాగస్వామ్యం తూర్పు కనుమలలో పులుల దీర్ఘకాలిక సంరక్షణకు విశేషంగా దోహదపడుతుందని విశ్వసిస్తున్నాం. ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో మాకు నిరంతరం మార్గదర్శకత్వం అందిస్తున్న కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. వన్యప్రాణి సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ లక్ష్యాల సాధనలో మహారాష్ట్ర ప్రభుత్వం, కేంద్రం, ఇతర భాగస్వామ్య సంస్థలతో కలిసి మరింత సమన్వయంతో ముందుకు వెళ్తాము’ అన్నారు పవన్ కళ్యాణ్. మహారాష్ట్ర నుంచి ఏపీకి త్వరలోనే రెండు ఆడపులులు వస్తుండటంతో ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం లభించింది.

## పదవీ విరమణ పొందిన

## హెడ్ కానిస్టేబుళ్లకు ఆత్మీయ వీడ్కోలు

**రాజన్న సిరిసిల్ల :** జిల్లా పోలీస్ కార్యాలయంలోని డీసీఆర్‌బీలో విధులు నిర్వహించిన హెడ్ కానిస్టేబుల్ వెంకటరమణయ్య, కొనరావుపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ అలీ పదవీ విరమణ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా అదనపు ఎస్పీ చంద్రయ్య ఇద్దరు అధికారులను పూలమాలలు వేసి,శాలువాలతో సన్మానించారు. పోలీస్ శాఖలో వారు సుదీర్ఘకాలం అంకితభావంతో, నిజాయితీగా విధులు నిర్వహించి శాఖకు మంచి పేరు తీసుకువచ్చారని కొనియాడుతూ అభినందనలు తెలిపారు.పోలీస్ శాఖలో వారి సేవలు చిరస్మరణీయమని, పదవీ విరమణ అనేది ఉద్యోగానికి మాత్రమేనని, వ్యక్తిత్వానికి కాదని అదనపు ఎస్పీ తెలిపారు.పదవీ విరమణ అనంతరం కూడా కుటుంబానికి లేదా వ్యక్తిగతంగా ఎలాంటి సమస్యలు వచ్చినా జిల్లా పోలీస్ శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# సంపాదకీయం

## వ్యవసాయ సంక్షోభం తప్పదా

పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం వల్ల సంభవించే ఎల్ నినో ప్రస్తుత వాతావరణాన్ని పూర్తిగా శాసిస్తోంది. వర్షాల కొరత నేరుగా ఖరీఫ్ సీజన్‌పై దెబ్బకొట్టబోతోంది. తెలుగు రాష్ట్రాల్లో వరి, పత్తి, మిరప, వేరుశనగ సాగు చేసే రైతులు ఇప్పటికే విత్తనాలు వేయడానికి వెనుకంజ వేస్తున్నారు. కాలవర్షాలు కురవకపోతే పంట దిగుబడి గణనీయంగా పడిపోయి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నభిన్నమవుతుంది. దీని ప్రభావం మార్కెట్లపై పడి పప్పుధాన్యాలు, కూరగాయలు, నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటే ప్రమాదం ఉంది. పాలకులకు ఇది కేవలం వాతావరణ సమస్యే కాదు, ఆర్థిక సంక్షోభానికి దారితీసే ముప్పు కూడా. జూలై, ఆగస్టు నెలల్లో కూడా ఎల్ నినో ప్రభావం తీవ్రంగానే ఉండబోతోంది. కాబట్టి, అందుబాటులో ఉన్న కొద్దిపాటి జలవనరులను అత్యంత జాగ్రత్తగా మేనేజ్ చేయడం ఒక్కటే ప్రస్తుతానికి ఉన్న మార్గం. గత ఏడాది పడాల్సిన వర్షాలు ముందే కురిసి, శ్రీశైలానికి వరుసగా మూడు, నాలుగు నెలల పాటు రికార్డు స్థాయిలో ఇన్‌ఫ్లో తెచ్చిపెట్టాయి. కానీ ఈ ఏడాది పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. నైరుతి రుతుపవనాల గమనం మందగించడంతో దేశంలోని సగానికి పైగా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతోంది. వాతావరణ నిపుణుల అంచనాల ప్రకారం, ఈ సీజన్‌లో దేశవ్యాప్త సగటు వర్షపాతం లోటు భారీగా ఉండే ప్రమాదం ఉంది. ఇది దేశ ఆహార భద్రతపై నేరుగా ప్రభావం చూపనుంది. దక్షిణ భారతదేశంలో ఎల్ నినో ప్రభావం అత్యంత స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా జూన్ నాటికి నిండాల్సిన కర్ణాటక, కేరళ, తమిళనాడులోని ప్రధాన జలాశయాలు ఈసారి వెలవెలబోతున్నాయి. కావేరి, కృష్ణా బేసిన్లలో నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి. దక్షిణాదిలోని ప్రధాన నగరాల్లో ఇప్పటికే తాగునీటి ఎద్దడి సంకేతాలు కనిపిస్తుండగా, విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన జలవనరులు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వర్షాలు సకాలంలో పడకపోతే అంతర్-రాష్ట్ర జల వివాదాలు మళ్లీ రాజుకునే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు జీవనాడి అయిన శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల భవితవ్యం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఎగువన మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి భారీగా వరద వస్తేనే ఈ డ్యామ్‌లు నిండుతాయి. అయితే ఎల్ నినో కారణంగా కృష్ణా నది ఎగువ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు మొహం చాటేశాయి. గత ఏడాది తరహాలో ఈసారి జలాశయాలు నిండుతాయా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గోదావరి బేసిన్‌లోనూ ఇదే పరిస్థితి ఉండటంతో.. అటు రాయలసీమకు తాగునీరు, ఇటు కోస్తా, తెలంగాణ జిల్లాలకు సాగునీరు అందించడం ఉభయ రాష్ట్ర ప్రభుత్వాలకు సవాలుగా మారనుంది. ఎల్ నినో ప్రభావం కారణంగా దేశంలో సాధారణం కంటే తక్కువగా వర్షాలు కురిసే 315 జిల్లాలను కేంద్ర వ్యవసాయ శాఖ గుర్తించింది. ఈ జిల్లాలు కలిగిన ఆయా రాష్ట్రాలు తమ అత్యవసర ప్రణాళికలను అమలు చేయాలని ఆదేశించింది. ఈ 315 జిల్లాల్లో 25 శాతం కంటే తక్కువ సాగునీటి వసతి కలిగిన 111 జిల్లాలను అత్యంత ప్రమాదకమైన కేటగిరీగా గుర్తించారు. 25 నుంచి 50 శాతంలోపు సాగునీటి వసతి ఉన్న మరో 76 జిల్లాలను మధ్యస్థ ప్రమాదకర కేటగిరీలో చేర్చగా, 50 శాతం కంటే ఎక్కువ సాగునీటి సౌకర్యం ఉన్న 128 జిల్లాలను సాపేక్షంగా తక్కువ ముప్పు ఉన్న ప్రాంతాలుగా పరిగణించారు. అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్న జిల్లాలు ఎక్కువగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో కేంద్రీకృతమై ఉన్నాయి. మిగిలిన జిల్లాలు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, బీహార్, జార్ఖండ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. బలహీనమైన రుతుపవనాల ప్రభావాన్ని తట్టుకునేందుకు పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు, నూనె గింజల సాగువైపు రైతులను ప్రోత్సహించాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించింది. పంటల వైవిధ్యం, తేమ సంరక్షణ, సమర్థవంతమైన నీటి యాజమాన్యం వంటి వ్యూహాలను అనుసరించాలని తెలిపింది. చెరువుల మరమ్మతులు, చెక్ డ్యామ్‌ల పునరుద్ధరణ, కాలువల్లో పూడికతీత, నీటి సంరక్షణ నిర్మాణాల విస్తరణ ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని బలోపేతం చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది. మరోవైపు 2026 ద్వితీయార్థంలో ఎల్ నినో తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి వాతావరణ సంస్థ హెచ్చరించింది. 'సౌత్ ఏషియన్ ?క్లైమేట్ అవుట్ లుక్ ఫోరం' అంచనాల ప్రకారం భారతదేశంలో దీర్ఘకాలిక సగటు వర్షపాతంలో కేవలం 90 శాతం మాత్రమే కురిసే అవకాశం ఉంది. తీవ్రమైన ఉష్ణోగ్రతలు, నీటి ఎద్దడి కారణంగా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎల్ నినో వల్ల అనావృష్టి ఏర్పడి ఆహార ద్రవ్యోల్బణం పెరిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

# కేబినెట్ ఫైట్... శాఖల మార్పులు తప్పవా



తెలంగాణకు చెందిన సీనియర్ బీజేపీ నాయకుడు, ప్రస్తుతం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్‌కు పదవీ గండం తొలగిపోయినట్టేనని జాతీయ మీడియా సహా.. బీజేపీ వర్గాల్లో చర్చ సాగుతోంది. కేంద్ర మంత్రివర్గ ప్రక్షాళనకు సమయం ఆసన్నమైందని బీజేపీ సీనియర్లు చెబుతున్నారు. ఈ నెలలోనే అంటే.. కొద్ది రోజుల్లోనే ప్రక్షాళన చేయనున్నారని అంటున్నారు. అయితే ప్రస్తుతం .. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విదేశీ పర్యటనలో ఉన్నారు. ఆయన సోమవారం నాటికి వచ్చే అవకాశం ఉంది. ఆయన రాగానే అదే రోజు లేదా ఈ నెల 30 నాటికి మంత్రి వర్గ మార్పు ఉంటుందని జాతీయ మీడియా వర్గాల్లో చర్చ సాగుతోంది. ఇటీవలే ప్రధాని మోడీ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి వర్గ ప్రక్షాళనపైనే ఆమెతో చర్చించినట్టు కూడా వార్తలు రాగా.. తాజాగా మరో విషయం వెలుగు చూసింది. మంత్రుల కూర్పుపై పలు పేర్లతో కూడిన జాబితాను కూడా రాష్ట్రపతికి ప్రధాని అందించారని జాతీయ మీడియా తెలిపింది. ఈ నేపథ్యంలో బండి సంజయ్ చోటు ఏమాత్రం చెదిరిపోదన్న వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. వాస్తవానికి ఇటీవల బండి భగీరథ్ వ్యవహారం తెరమీదికి వచ్చిన తర్వాత.. కేంద్ర మంత్రిగా సంజయ్‌ను తప్పిస్తారన్న చర్చ సాగింది. కానీ, ఈ విషయంలో బండి ప్రమేయం లేదని.. ఆయన పార్టీకి చేసిన సేవల నేపథ్యంలోనే పదవి లభించిందన్న వాదన ఉంది. పైగా.. పార్టీకి కుటుంబ వ్యవహారాలకు కూడా సంబంధం లేదని అంటున్నారు. ఈ నేపథ్యంలో బండి సంజయ్ సీటు విషయంలో ఎలాంటి మార్పులు ఉండవని తెలుస్తోంది. ఇక, రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి మొత్తం ఐదుగురు మంత్రులు ఉండగా.. బండి సంజయ్‌ను అలానే కొనసాగించినా.. మిగిలిన నలుగురి విషయంలో మార్పులు ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రస్తుతం పౌర విమానయాన శాఖ మంత్రిగా ఉన్న కింజరాపు రామ్మోహన్‌నాయుడును పర్యాటక శాఖ మంత్రిగా(ఇండిపెండెంట్ )గా పంపించే అవకాశం ఉందని గట్టిగా చెబుతున్నారు. ఇక, తెలంగాణకు చెందిన కిషన్‌రెడ్డిని పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా పంపించే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం కిషన్ రెడ్డి గనుల శాఖ మంత్రిగా ఉన్నారు. అలానే.. గుంటూరు ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ విషయంలోనూ మార్పు ఉండే అవకాశం ఉందని.. ఆయనను కూడాహోం శాఖ పరిధిలోకి తీసుకుంటారని అంటున్నారు. ఇక, బీజేపీ నాయకుడు, నరసాపురం ఎంపీ శ్రీనివాస వర్మ.. ప్రస్తుతం కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రిగా ఉన్నారు. ఆయనను కూడా మార్పు చేసి.. కేంద్ర పర్యావరణ, అటవీశాఖ సహాయ మంత్రిగా పంపించే అవకాశం ఉందని తెలుస్తోంది. మొత్తంగా ఈ మార్పులు చేర్పులు ఉండడం మినహా మంత్రులను తప్పించే అవకాశం లేదని సమాచారం.

**నిర్మలమ్మ స్థానంలో శక్తికాంత్ దాస్**

కేంద్ర మంత్రివర్గంలో ప్రక్షాళన ఖాయమనే వార్తలు వస్తున్న నేపథ్యంలో కీలకమైన ఆర్థిక శాఖ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. దాదాపు 10 సంవత్సరాలుగా ఈ శాఖకు మంత్రిగా ఉన్న నిర్మలా సీతారామన్‌ను తప్పించడం ఖాయమని ఢిల్లీ వర్గాలు సహా.. బీజేపీ పెద్దలు కూడా చూచాయగా చెబుతున్నారు. అంతేకాదు.. ఆమె స్థానంలో ఆర్ బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్‌కు పగ్గాలు అప్పగిస్తారని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న సమయంలో శక్తికాంత దాస్.. చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఇది ఇప్పుడు ఆయనకు కలిసి వస్తుందని అంటున్నారు. గత 10 సంవత్సరాలకు పైగానే కేంద్ర ఆర్థిక మంత్రిగా అపర చాణిక్యురాలిగా పేరొందిన నిర్మలా సీతారామన్‌ను మార్చడానికి పలు కారణాలు ఉన్నాయని జాతీయ మీడియా పేర్కొంది. గత రెండేళ్లుగా నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతోపాటు.. ఆర్థిక కార్యకలాపాలపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్న దరిమిలా.. త్వరలోనే జరగనున్న పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల వ్యవహారం కూడా దీనికి లింకుగా ఉందని పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రజల ఆగ్రహాన్ని తగ్గించేందుకు.. దేశంలో ఆర్థిక సమస్యలు తగ్గించి.. కార్యకలాపాలను గాడిలో పెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని జాతీయ మీడియా పేర్కొంటోంది. డాలర్‌తో పోలిస్తే.. గత రెండేళ్లుగా రూపాయి మారకం విలువ పడిపోతోంది. అదేసమయంలో స్టాక్ మార్కెట్లలో భారీ నష్టాలు.. దేశీయంగా ఆర్థిక కార్యకలాపాలు మందగించడం.. మరోవైపు పొంచి ఉన్న ద్రవ్యోల్బణ ముప్పు వంటి వాటిని సమర్థవంతంగా నిర్మలమ్మ ఎదుర్కొనలేక పోతున్నారన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆమెను తప్పించడం ఖాయమని చెబుతున్నారు. అయితే.. పూర్తిస్థాయిలో ఆమెను మంత్రివర్గం నుంచి తప్పించకుండా.. శాఖను మాత్రమే మార్పు చేసే అవకాశం ఉందని పెద్ద ఎత్తున బీజేపీ నాయకుల మధ్య కూడా చర్చ సాగుతోంది. ఇక, శక్తికాంత దాస్ విషయానికి వస్తే.. ఆర్బీఐ గవర్నర్‌గా ఆయన కరోనా వంటి కీలక సమయంలోనూ ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసే చర్యలు చేపట్టారు. ప్రపంచ స్థాయిలో ఆర్థిక స్థితి మందగమనంలో ఉన్నప్పుడు కూడా భారత్ తనను తాను నిలబెట్టుకు నేలా ఆయన వ్యూహాత్మకంగా ముందుకు సాగారు. ఆర్థిక రిజర్వులు తగ్గిపోకుండా చూశారు. ఇవన్నీ భవిష్యత్తులో దేశాన్ని మరోసారి నిలబెట్టే అవకాశం ఉంటుందన్న చర్చ సాగుతోంది. కాగా.. ప్రస్తుతం శక్తికాంతదాస్ పార్లమెంటుకు ఏ సభ నుంచి కూడా ప్రాతినిధ్యం వహించడం లేదు. అయినప్పటికీ.. ఆయనను మంత్రిగా తీసుకుని.. తర్వాత రాజ్యసభకు ప్రమోట్ చేయించే అవకాశం ఉందని అంటున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# పోలవరం ముంపు.. తెలంగాణకు ముప్పు



ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే భారీ వర్షాలు, వరదల వల్ల తెలంగాణ భూభాగంలోని భద్రాచలం పరిసరాల్లోని గోదావరి తీర ప్రాంతంలో పెను విధ్వంసం జరుగనున్నది. ఈ వాస్తవాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం గ్రహించాలి. దిగువన డ్యామ్ నిర్మాణంతో కాఫర్ డ్యామ్, స్పిల్ వే వల్ల బ్యాక్ వాటర్ (నదిలో స్థిరంగా ఉండే నీళ్లు) చుట్టుముడుతాయి. ముంపు మండలాల్లో పరిస్థితి మరీ దయనీయంగా మారే ప్రమాదం ఉన్నది. వరదలు వస్తే 30 రోజుల పాటు జనావాసాలు జలమయమై తినడానికి తిండి, ఉండటానికి ఇల్లు, చేయడానికి పనిలేక ప్రజలు ఇబ్బందులు పడుతారు. అటువంటి కీలకమైన ముంపు సమస్య పరిష్కారానికి తెలంగాణ ప్రాంత ప్రజల శ్రేయస్సు, రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముంపు నివారణ చర్యలు చేపట్టకపోగా నిమ్మకు నీరెత్తినట్లు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయి. గతంలో అనేకసార్లు తెలంగాణ ఆత్మగల దార్శనికుడు కేసీఆర్ సమర్థ నాయకత్వంలో క్యాబినెట్ మంత్రిగా పోలవరం ముంపు సమస్యపై పెద్దఎత్తున తెలంగాణ పక్షాన వాదించాను. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించి ముంపు నుంచి తెలంగాణవాసులకు విముక్తి కల్పించాలని డిమాండ్ చేసినా కేంద్రం పట్టించుకోలేదు.

పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి తీరుతామని ఏపీ సీఎం చంద్రబాబు అంటున్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముంపు సమస్య పరిష్కారానికి చొరవ చూపకుండా ప్రజల ప్రయోజనాల పట్ల బాధ్యతారహితంగా వ్యవహరిస్తూ సోయి లేకుండా వ్యవహరిస్తున్నది.

2022లో భద్రాచలం వద్ద 71.3 అడుగుల ఎత్తులో వచ్చిన వరద 22 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహంగా నమోదైంది. పోలవరం పూర్తిస్థాయి నీటిమట్టం 45.72 మీటర్లు కాగా భద్రాచలం వద్ద గోదావరి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి కూడా సరిగ్గా 45.72 మీటర్లు. అంటే పోలవరం నిండితే భద్రాచలం ఎప్పుడూ ముంపు ప్రమాదంలోనే ఉంటుందని భావించాలి. భద్రాచలం వద్ద గోదావరి నది లోతైన బెడ్ లెవల్ 26 మీటర్లు బ్యాక్‌వాటర్ ప్రభావం వల్ల భద్రాచలంలో ఎప్పుడూ 13.15 మీటర్ల నుంచి 17.72 మీటర్ల మేర నీరు నిల్వ ఉంటుంది. ఇది నిత్యం తీవ్రమైన సమస్యగా మారుతున్నది. 900 ఎకరాల్లో నష్ట ప్రభావం కూడా ఉంటుంది. 2021లో పోలవరం కాఫర్‌డ్యామ్ నిర్మాణం పూర్తయిన తర్వాత 2022లో వచ్చిన వరదల్లో బ్యాక్‌వాటర్ కారణంగా భద్రాచలంతో పాటు పరిసరాలు విలవిల్లాడాయి 40 శాతం భద్రాచలం పట్టణం జలమయమై, బాధితులు దీనావస్థలో రోడ్డున పడ్డారు. వరద బాధితులను అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ఆదుకున్నది.

అప్పట్లో 22 లక్షల క్యూసెక్కుల వరదకే ఇంత నష్టం జరిగితే.. ప్రాజెక్టు డిజైన్ ప్రకారం భవిష్యత్తులో 36 లక్షల నుంచి 50 లక్షల సెక్యూల వరద వస్తే ఊహించని విధంగా ప్రాణ, ఆస్తి నష్టంతో పూర్తిగా మునిగిపోయే ప్రమాదం పొంచిఉన్నది. పలు అధ్యయనాల ప్రకారం 36 గ్రామాల పరిధిలోని 184 చదరపు కిలోమీటర్ల మేర ముంపు ప్రభావం పడుతుందని తెలుస్తున్నది. కేవలం గ్రామాలే కాకుండా ఈ ప్రాంతంలోని భారీ పరిశ్రమలకు కూడా బ్యాక్‌వాటర్ ముప్పు పొంచి ఉన్నది. దాదాపు ఐదువేల కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న ఐటీసీ పేపర్‌బోర్డ్, హెవీ వాటర్ ప్లాంట్, దుమ్ముగూడెం జలవిద్యుత్తు ప్రాజెక్టులకు ఈ బ్యాక్‌వాటర్ వల్ల తీవ్ర ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంటుంది. దక్షిణాది అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రికి ఘనమైన ప్రాశస్త్యం ఉన్నది. అలాంటి రామాలయానికి కూడా పోలవరం ముంపు ముప్పు తప్పదు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పోలవరం ప్రాజెక్టు ద్వారా సంభవించే ముంపు ముప్పును నివారించేందుకు చర్యలు చేపట్టాలి. పునరావాస ప్యాకేజీ అమలు చేయాలి.

గోదావరి వరద తట్టుకునేందుకు కరకట్టలు కట్టాలి. ఇప్పటికే ఉన్న వాటి కరకట్టల ఎత్తును పెంచాలి. వర్షాకాలంలో స్లూయిస్‌ల దగ్గర వరద నీరు ప్రవహించదు కనుక ఆ సమయంలో మోటర్ల ద్వారా నీటిని తోడేయాలి. లోతట్టు ప్రాంత ప్రజలను మెరక ప్రాంతానికి తరలించి కాలనీలు నిర్మించాలి. ఎక్కువగా పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలి. రహదారులపై ప్రవహించే వాగుల మీద చప్టాలు నిర్మించాలి. వంతెనలు ఏర్పాటు చేయాలి. అవసరమైన చోట రోడ్ల ఎత్తు పెంచాలి. తక్షణ చర్యలతో పాటు మౌలిక సదుపాయాల రక్షణ, ప్రజల భద్రత, పర్యావరణ, సాంకేతిక చర్యలు, పరిశ్రమలు, వారసత్వ ప్రాంతాల రక్షణ, విధానపరమైన చర్యలు వంటి పలు కీలక అంశాలపై దృష్టి సారించాలి. తెలంగాణ ప్రజల రక్షణకు, వారి శ్రేయస్సు కోసం పాటుపడాల్సిన ఆవశ్యకత ప్రభుత్వాలపై ఉన్నది. ముంపు నుంచి తెలంగాణ ప్రజల ప్రయోజనాలే పరమావధిగా బాధ్యతాయుతంగా పనిచేయాలని బీఆర్‌ఎస్ తరఫున, ప్రజల పక్షాన డిమాండ్ చేస్తున్నాం. మానవజాతిని కాపాడటం, భవిష్యత్‌తరాలకు మనం ఇచ్చే భద్రత. అదే అందరికీ శ్రీరామరక్ష.

# పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తద్దు

**సౌకర్యాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం**

**తెలంగాణ రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్.**



**జగిత్యాల :** 2027 లో జరిగే గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తుల కోరకు తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం ప్రైవేట్ కన్సల్టెన్సీ ప్రతినిధులతో కలసి గోదావరి తీరంలో మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ... 2027 లో నిర్వహించే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని మంత్రి తెలిపారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలో ఆలయాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు ఇప్పటికి ప్రభుత్వం రూ. వెయ్యి కోట్లు కేటాయించిందని మంత్రి తెలిపారు. ధర్మపురి నియోజకవర్గానికి రూ. 117 కోట్లు కేటాయించినట్లు మంత్రి వివరించారు. ధర్మపురి క్షేత్రానికి పుష్కర స్నానాలు ఆచరించే భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తుల కొరకు తాగునీటి సౌకర్యం, డ్రెస్సింగ్ రూమ్స్, మరుగుదొడ్ల సౌకర్యం, పారిశుధ్య పనుల నిర్వహణ కొరకు గత గోదావరి పుష్కరాలకు, కృష్ణ పుష్కరాలకు పనులు చేసిన ప్రతినిధులతో కలిసి మంగళవారం పరిశీలించినట్లు మంత్రి తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనకు చేయాల్సిన ఏర్పాట్లపై కన్సల్టెన్సీ ప్రతినిధులు పూర్తిస్థాయి నివేదిక అందజేస్తారని మంత్రి తెలిపారు. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం నుండి అదనపు నిధులు తీసుకువచ్చి భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ తో పాటు వేముల రాజు, ధర్మపురి మున్సిపల్ వైస్ చైర్మన్ రామన్న , వార్డు కౌన్సిలర్లు చీపిరిశెట్టి రాజేష్, అయ్యోరి గోపాల్, పవన్, ప్రశాంత్, వోజ్జల లక్ష్మణ్ లతో పాటు జక్కు రవీందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డిపై విషప్రచారం మానుకోవాలి

## కాంగ్రెస్ నాయకులు.. రావెళ్ల కృష్ణారావు, మైలారి శెట్టి భాస్కర్



**సూర్యాపేట జిల్లా :** నల్గొండలో జరిగిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభకు ప్రజల నుంచి లభించిన విశేష ఆదరణను చూసి బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక నిరాధార ఆరోపణలు, అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ నాయకులు రావెళ్ల కృష్ణారావు, మైలారి శెట్టి భాస్కర్ ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. మంగళవారం కోదాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, నల్గొండ సభ విజయవంతం కావడంతో రాష్ట్ర ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి పెరుగుతున్న ఆదరణను చూసి బీఆర్ఎస్ నాయకత్వం భయాందోళనకు గురైందన్నారు. అందుకే ప్రజల దృష్టి మరల్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ముఖ్యమంత్రిని విమర్శించే ముందు తన రాజకీయ చరిత్రను పరిశీలించుకోవాలని సూచించారు. తన హయాంలో మట్టి మాఫియా, ఇసుక మాఫియాలకు అండగా నిలిచి కోట్ల రూపాయల దోపిడీ జరిగిందనే ఆరోపణలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు, పోలీసు శాఖ అధికారుల నుంచి డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలపై ప్రజలకు వివరణ ఇవ్వాలని కోరారు. దళిత బంధు పథకం అమలులో లబ్ధిదారుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలను ప్రజలు మర్చిపోలేదని పేర్కొంటూ, ఆ ఆరోపణలు అసత్యమైతే బహిరంగంగా సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. వైన్ షాపుల కేటాయింపుల్లో బినామీల ద్వారా సిండికేట్‌లు ఏర్పాటు చేసి భారీగా డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలపై కూడా మాజీ ఎమ్మెల్యే స్పందించాలని డిమాండ్ చేశారు. కోదాడ ఖమ్మం క్రాస్‌రోడ్డు వద్ద కోట్ల రూపాయల విలువైన ఆస్తి కబ్జా ఆరోపణలపై కూడా బొల్లం మల్లయ్య యాదవ్ ప్రజలకు సమాధానం చెప్పాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఇతరులపై విమర్శలు చేసే ముందు తనపై వచ్చిన ఆరోపణలకు వివరణ ఇవ్వాలని అన్నారు. తన హయాంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికలు, ఎంపీపీ, సొసైటీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ అధ్యక్షుల నియామకాల కోసం డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలపై కూడా ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ టికెట్ కోసం కేసీఆర్, కేటీఆర్ వద్ద ఎంత మొత్తం ఖర్చు చేశారో ప్రజలకు వెల్లడించే ధైర్యం మాజీ ఎమ్మెల్యేకు ఉందా అని ప్రశ్నించారు. ఇతరులపై ఆరోపణలు చేసే ముందు తన రాజకీయ ప్రయాణానికి సంబంధించిన వాస్తవాలను ప్రజలకు చెప్పాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు కమిషన్లు తీసుకున్నారని చేస్తున్న ఆరోపణలకు ఒక్క ఆధారం కూడా లేదని పేర్కొన్న వారు, నిజంగా ఆధారాలు ఉంటే ప్రజల ముందుకు తీసుకురావాలని, లేకపోతే అబద్ధపు ప్రచారాన్ని వెంటనే నిలిపివేసి రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అసత్య ప్రచారం, వ్యక్తిగత దూషణలు, నిరాధార ఆరోపణలతో రాజకీయాలు చేసే బీఆర్ఎస్‌కు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని రావెళ్ల కృష్ణారావు, మైలారి శెట్టి భాస్కర్ అన్నారు. ఆధారాలు లేని ఆరోపణలు, వ్యక్తిత్వ హననానికి పాల్పడితే కాంగ్రెస్ పార్టీ రాజకీయంగానూ, చట్టపరంగానూ గట్టిగా ఎదుర్కొంటుందని వారు స్పష్టం చేశారు.

## రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆధ్వర్యంలో ఇంచార్జ్‌లతో సమీక్షా సమావేశం



**గోదావరిఖని:** భారత ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పురోగతిపై రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మంగళవారం రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇంచార్జ్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి ఇంటికి చేరుకుని ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు నమోదు అయ్యేలా క్షేత్రస్థాయిలో అధికారులు, ఇంచార్జ్‌లు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని, అవసరమైన పత్రాల సేకరణలో ప్రజలకు సహకరించాలని సూచించారు. ప్రతి డివిజన్‌లో, గ్రామాల్లో రోజువారీ పురోగతిని పర్యవేక్షిస్తూ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డివిజన్, గ్రామాల ఇంచార్జ్‌లు తమ పరిధిలో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిని ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సమావేశం నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రజాబాట కార్యక్రమంలో విద్యుత్ భద్రతపై విస్తృత అవగాహన




**హుజురాబాద్ :** హుజూరాబాద్ డివిజన్ పరిధిలోని హుజూరాబాద్ టౌన్ సెక్షన్‌లో మంగళవారం నిర్వహించిన 'ప్రజాబాట' కార్యక్రమంలో విద్యుత్ భద్రతపై వినియోగదారులు, వ్యవసాయదారులకు విస్తృత అవగాహన కల్పించామని కరీంనగర్ డీఈ (టెక్నికల్ అండ్ సేఫ్టీ) శ్రీ ఉపేందర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ సిబ్బందికి విధి నిర్వహణలో ప్రతి ఉద్యోగి 'వన్ మినిట్ సేఫ్టీ' సూత్రాన్ని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రతి పని ప్రారంభించే ముందు ప్రమాదాలను అంచనా వేసి, అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చని వివరించారు. వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు ఎట్టి పరిస్థితుల్లోనూ స్వయంగా ఫ్యూజ్‌లు మార్చేందుకు ప్రయత్నించవద్దని, ఏవైనా లోపాలు తలెత్తినప్పుడు వెంటనే 1912 టోల్ ఫ్రీ నంబర్కు సమాచారం అందించాలని సూచించారు. వ్యవసాయ మోటార్లకు అదనపు లోడ్లు ఉపయోగిస్తున్న రైతులు 5 హెచ్‌పీ నుంచి 7.5 హెచ్‌పీ వరకు అదనపు లోడ్లను నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించుకోవాలని అవగాహన కల్పించారు. అదేవిధంగా, విద్యుత్ సరఫరా నాణ్యతను మెరుగుపరచడం, ప్రమాదాల నివారణ లక్ష్యంగా పొడవైన విద్యుత్ లైన్లపై మధ్య స్తంభాల ఏర్పాటు, దెబ్బతిన్న షార్ట్ పోల్స్ మార్పిడి, వదులుగా ఉన్న వైర్ల (లూజ్ స్పాన్లు) సరిదిద్దడం, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ స్తంభాల ప్లింత్‌లను ఎత్తు పెంచడం, వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేయడం వంటి అంశాలపై అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ప్రజల భాగస్వామ్యంతో విద్యుత్ భద్రతను మరింత బలోపేతం చేసి, అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే టీజీఎన్‌పీడీసీఎల్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ ఏఈ (ఆపరేషన్), ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బంది, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పెరుగుతున్న రౌడీయిజం, గుండాయిజం

**వికారాబాద్ :** వికారాబాద్ నియోజకవర్గంలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రౌడీయిజం, గుండాయిజం పెరిగిపోతోందంటూ స్థానిక బిజెపి నేతలు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇటీవల కరీంపూర్ గేట్ సమీపంలో జరిగిన ఒక ఘటనను గురించి, గ్రామానికి సర్పంచ్‌గా ఉన్న బీర్ల రాజు పైనే కొందరు రౌడీ షీటర్లు కత్తులతో దాడికి తెగబడ్డారని బిజెపి నాయకుడు ఆరోపించారు. బాధిత సర్పంచ్ బీర్ల రాజు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకులు కొందరు పాత వీడియోలను అడ్డం పెట్టుకుని మండల నాయకులపై ఒత్తిడి తెస్తున్నారని, తనపై అక్రమంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టించేందుకు కుట్రలు పన్నారని ఆరోపించారు. అంతేకాకుండా, తాను పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లిన సమయంలో కూడా కాంగ్రెస్ నాయకుల నుంచి పోలీసులకు ఫోన్ కాల్స్ వస్తూనే ఉన్నాయని, దీనివల్ల పోలీసులు తన ఫిర్యాదును సక్రమంగా తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు. ?తనపై జరిగిన దాడిని తారుమారు చేసి, తానే కత్తులు తెచ్చినట్లుగా అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఇలాంటి రౌడీలను, గుండాలను ప్రోత్సహిస్తే అది ఆ పార్టీకే నష్టమని ఆయన హెచ్చరించారు.

## గజ్వేల్ రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సిపి రష్మీ పెరుమాళ్

**సిద్దిపేట :** గజ్వేల్ రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని సిపి రష్మీ పెరుమాళ్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో కల్పించిన సౌకర్యాలు, రికార్డుల నిర్వహణ, భద్రతా చర్యలు, సిబ్బంది పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలను సిపి పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించి, కార్యాలయ పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే అంశాలపై సూచనలు చేశారు. పోలీస్ కార్యాలయాలు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండటంతో పాటు, సిబ్బందికి అనుకూలమైన వాతావరణం కల్పించడం ద్వారా సేవల నాణ్యత మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. అనంతరం వార్షిక తనిఖీల్లో భాగంగా సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలించిన సిపి. సర్కిల్ పరిదిలో నమోదవుతున్న గ్రేవ్ కేసులను పరిశీలించారు. గ్రేవ్ కేసులలో ఫోక్సో కేసులలో నిందితులకు శిక్షలు పడే విధంగా క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని సూచించారు ఎస్ఓపి ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేయాలని సూచించారు. కేసుల దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలని, తరచుగా సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ లను సందర్శించాలని , సిబ్బంది పనితీరును నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలనీ సిఐ రవిరాజు కి సూచించారు. సర్కిల్ పరిదిలోని రౌడీ షీటర్లు,హిస్టరీ షీటర్ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రతి నెల వారికి సంబందించిన నూతన సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలన్నారు. కమ్యూనిటీ పోలీసులలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రజలకు సైబర్ నేరాలు వివిధ సామాజిక అంశాలపై ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలని,అదేవిధంగా సిద్దిపేట సురక్ష నేత్ర లో భాగంగా సిసి కెమెరాలు యొక్క ప్రాముఖ్యత గురించి గ్రామాల్లో తెలియజేస్తూ ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొనే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ నర్సింలు,సిఐ రవిరాజు,ఎస్సైలు ఆరోగ్యం, రఘుపతి, కృష్ణ రెడ్డి, యోనుస్ ఖాన్ మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 64 ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే క్లియర్ చేయాలి.. విద్యార్థుల ఆందోళన!

**హైదరాబాద్ :** తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని, పెండింగ్‌లో ఉన్న సుమారు రూ. 8 వేల కోట్ల ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్రవ్యాప్త కళాశాలల బహిష్కరణ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభించిందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం తెలిపారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య పిలుపు మేరకు గుజ్జ సత్యం అధ్యక్షతన నిర్వహించిన ఈ ఆందోళనలో వందలాది మంది విద్యార్థులు పాల్గొని ప్రభుత్వ వైఖరిపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారని ఆయన పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి కొత్తపేట చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గుజ్జ సత్యం మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ అనేది ప్రభుత్వ దయాదాక్షిణ్యం కాదని, రాజ్యాంగబద్ధమైన విద్యా అవకాశాలను కల్పించే సామాజిక న్యాయ పథకమని స్పష్టం చేశారు. వేలాది మంది పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థుల భవిష్యత్తు ఈ పథకంపై ఆధారపడి ఉందని, అయినప్పటికీ ప్రభుత్వం నిధుల విడుదలలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం అత్యంత బాధాకరమన్నారు. ఇప్పటికే కళాశాలలకు వేల కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోవడంతో అనేక విద్యాసంస్థలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయని, మరోవైపు విద్యార్థులు ఫీజుల పేరుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యను హక్కుగా గుర్తించిన ప్రభుత్వం, అదే హక్కు అమలులో మాత్రం వెనుకడుగు వేయడం విరుద్ధమైన వైఖరని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన చర్యలు విద్యార్థుల్లో నెలకొన్న అనిశ్చితిని తొలగించలేకపోయాయని, పూర్తి స్థాయిలో పెండింగ్ బకాయిల విడుదలపై స్పష్టమైన హామీ ఇవ్వకపోతే ఆందోళనలు మరింత ఉధృతం అవుతాయని హెచ్చరించారు. విద్యార్థుల సహనాన్ని ప్రభుత్వం పరీక్షించవద్దని, సమస్యను రాజకీయ కోణంలో కాకుండా విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా పరిష్కరించాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని యథాతథంగా కొనసాగించడం, పెండింగ్‌లో ఉన్న రూ. 8 వేల కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయడం, విద్యార్థులపై ఆర్థిక భారం మోపే విధానాలను ఉపసంహరించుకోవడం వరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం పోరాటం కొనసాగుతుందని గుజ్జ సత్యం స్పష్టం చేశారు.

## విజయవాడలో ఘోర ప్రమాదం, ముగ్గురు మృతి

**విజయవాడ :** ఉమ్మడి కృష్ణా జిల్లాలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గన్నవరం సమీపంలోని బి.బి. గూడెం వద్ద కొత్త జాతీయ రహదారి (విజయవాడ వెస్ట్ బైపాస్)పై ఒకేసారి పలు వాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దురదృష్టకర సంఘటన మూడు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళితే, విజయవాడ నుంచి ఏలూరు వైపు వెళుతున్న ఓ కారును వెనుక నుంచి వేగంగా వచ్చిన కంటైనర్ లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ధాటికి కారు అదుపుతప్పి ముందు వెళుతున్న ఆయిల్ ట్యాంకర్ లారీని బలంగా గుద్దుకుంది. రెండు లారీల మధ్య కారు పూర్తిగా నలిగిపోయి నుజ్జునుజ్జయింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో నాలుగేళ్ల చిన్నారి ఉన్నట్టు తెలుస్తోంది. కారులో ఉన్న మరో వ్యక్తి ఈ ప్రమాదంలో రెండు చేతులు కోల్పోయి, తీవ్ర రక్తస్రావంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. అదే సమయంలో, రోడ్డుపై వేగంగా వచ్చిన ఓ స్కూటరిస్ట్ కూడా ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అదుపుతప్పిన ఆయిల్ ట్యాంకర్ లారీ... స్కూటరిస్టును ఢీకొట్టింది. దాంతో అతడు అక్కడిక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న గన్నవరం పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు క్రేన్ల సహాయంతో ప్రమాదానికి గురైన వాహనాలను తొలగించి, రాకపోకలను పునరుద్ధరించారు. మృతదేహాలను, క్షతగాత్రుడిని గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లారీ అతివేగమే ప్రమాదానికి ప్రధాన కారణమని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ల

# హర్మ్యూజ్‌లో నౌకాయాన స్వేచ్ఛ కీలకం

పశ్చిమాసియాలో నెలకొన్న తాజా పరిస్థితులు, ప్రాంతీయ శాంతి, హర్మ్యూజ్ జలసంధిలో నౌకాయాన స్వేచ్ఛ వంటి కీలక అంశాలపై ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా పశ్చిమాసియాలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను ఇరాన్ అధ్యక్షుడు ప్రధానికి వివరించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) వెల్లడించింది. అలాగే భవిష్యత్ కార్యాచరణపై కూడా ఇరువురు నేతలు చర్చించినట్లు తెలిపింది. ఫోన్ సంభాషణలో ప్రధాని మోదీ, చర్చల ద్వారా సాధించిన పురోగతిని స్వాగతించారు. అన్ని సమస్యలను చర్చలు, దౌత్య మార్గంలోనే పరిష్కరించాలన్నదే భారతదేశం స్థిరమైన వైఖరి అని మరోసారి స్పష్టం చేశారు. ప్రాంతంలో శాశ్వత శాంతి, స్థిరత్వం నెలకొనేలా అన్ని వర్గాలు కృషి కొనసాగించాలని సూచించారు. అంతేకాకుండా అంతర్జాతీయ వాణిజ్యం, ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హర్మ్యూజ్ జలసంధిలో స్వేచ్ఛాయుత నౌకాయానం, వాణిజ్య రవాణా నిరంతరాయంగా కొనసాగడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. భారత్‌కు ఇంధన అవసరాల్లో గల్ఫ్ దేశాల ప్రాధాన్యం దృష్ట్యా హర్మ్యూజ్ జలసంధి వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైనది. ప్రపంచంలో సముద్ర మార్గంలో తరలించే ముడి చమురులో గణనీయమైన భాగం ఈ జలసంధి ద్వారానే రవాణా అవుతోంది. అలాంటి పరిస్థితుల్లో అక్కడ ఎలాంటి అంతరాయం ఏర్పడినా ప్రపంచ ఇంధన మార్కెట్లపై ప్రభావం పడటంతో పాటు భారత్ వంటి దిగుమతులపై ఆధారపడే దేశాలకు కూడా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలోనే హర్మ్యూజ్ జలసంధిలో స్వేచ్ఛాయుత నౌకాయానం కొనసాగాలని ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు పీఎంఓ పేర్కొంది.

ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ కూడా పశ్చిమాసియాలోని తాజా పరిణామాలను ప్రధానికి వివరించారు. ప్రాంతంలో నెలకొన్న పరిస్థితులు, శాంతి ప్రయత్నాలు, తదుపరి చర్యల గురించి ఆయన వివరణ ఇచ్చినట్లు అధికారిక ప్రకటనలో వెల్లడించారు. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు తగ్గి సాధారణ పరిస్థితులు నెలకొనేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై కూడా ఇరువురు నేతలు అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ ఫోన్ సంభాషణ అనంతరం ప్రధాని మోదీ సామాజిక మాధ్యమం ఎక్స్?లో స్పందించారు. పశ్చిమాసియాలో తాజా పరిణామాలపై ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ మసూద్ పెజెష్కియన్‌తో మాట్లాడినట్లు తెలిపారు. చర్చల్లో సాధించిన పురోగతిని స్వాగతించానని,





కొనసాగుతున్న ప్రయత్నాలు ప్రాంతంలో శాశ్వత శాంతికి దారి తీస్తాయని ఆశాభావం వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. అలాగే హర్మ్యూజ్?లో స్వేచ్ఛాయుత నౌకాయానం భారత్‌కే కాకుండా ప్రపంచానికే అత్యంత ముఖ్యమని మరోసారి పునరుద్ఘాటించినట్లు వెల్లడించారు.

**14 అంశాలతో కూడిన అవగాహన ఒప్పందం**

ఇటీవలి కాలంలో పశ్చిమాసియా పరిస్థితులపై ప్రధాని మోదీ, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ మధ్య జరిగిన వరుస చర్చల్లో ఇది మరో ముఖ్యమైన సంభాషణగా భావిస్తున్నారు. ప్రాంతీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరుదేశాల మధ్య సంప్రదింపులు కొనసాగుతున్నాయి. భారత పౌరుల భద్రత, ఇంధన సరఫరా, సముద్ర వాణిజ్య మార్గాల భద్రత వంటి అంశాలపై భారత్ నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. కొద్ది రోజుల క్రితం అమెరికా–ఇరాన్ మధ్య 14 అంశాలతో కూడిన అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరినట్లు సమాచారం వెలువడింది. ఇందులో హోర్మ్యూజ్ జలసంధిని తిరిగి పూర్తిస్థాయిలో తెరవడం, ఇరాన్‌పై అమలులో ఉన్న కొన్ని ఆర్థిక పరిమితులను సడలించడం వంటి అంశాలు ఉన్నట్లు అంతర్జాతీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలోనే ప్రధాని మోదీ, ఇరాన్ అధ్యక్షుడి మధ్య తాజా చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అయితే అమెరికాతో సమీప భవిష్యత్తులో ఎలాంటి రాజకీయ స్థాయి సమావేశాలు నిర్వహించే ప్రణాళిక ప్రస్తుతం లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ఎస్మాయిల్ బఘాయి మీడియాతో మాట్లాడుతూ, అమెరికా ప్రతినిధులతో రాబోయే రోజుల్లో ఏ స్థాయిలోనూ సమావేశాలు నిర్వహించే యోచన లేదన్నారు. దోహాలో జరగబోయే సమావేశాలు అమెరికాతో రాజకీయ చర్చలు కాదని, ఇప్పటికే కుదిరిన అవగాహన ఒప్పందంలోని అంశాల అమలుకు సంబంధించిన సాంకేతిక స్థాయి చర్చలేనని వివరించారు. ప్రత్యేకంగా ఇరాన్‌కు చెందిన స్తంభింపజేసిన ఆర్థిక ఆస్తుల విడుదల, ఒప్పందంలోని ఇతర నిబంధనల అమలుపై ఖతార్ ప్రతినిధులతో చర్చలు జరుగుతాయని ఆయన వెల్లడించారు. మరోవైపు, పశ్చిమాసియాలో శాంతి స్థాపనకు భారత్ ఎప్పటినుంచో సమతుల్య వైఖరినే అవలంబిస్తోంది. వివాదాలను యుద్ధం ద్వారా కాకుండా చర్చలు, దౌత్యం ద్వారానే పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వం పదేపదే చెబుతోంది. అదే సమయంలో భారత పౌరుల భద్రత, ఇంధన సరఫరా, అంతర్జాతీయ వాణిజ్య మార్గాల రక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్న సంకేతాన్ని కూడా ఇస్తోంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌తో జరిపిన తాజా టెలిఫోన్ సంభాషణ పశ్చిమాసియా పరిణామాలపై భారత వైఖరిని మరోసారి స్పష్టంగా తెలియజేసింది.

## ఇక డాలర్‌తో పనిలేదు...
## భారత్-జపాన్ కీలక ఒప్పందం!

భారత్, జపాన్ దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత సులభతరం చేసే దిశగా మరో కీలక అడుగు పడనుంది. ఇరు దేశాల మధ్య లావాదేవీలకు అమెరికా డాలర్‌పై ఆధారపడకుండా, నేరుగా రూపాయి–యెన్‌లలోనే చెల్లింపులు జరిపేందుకు వీలుగా ఒక కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయబోతున్నాయి. జులై 1 నుంచి 3 వరకు జపాన్ ప్రధాని సనా తకాయిచి భారత పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీతో జరిపే భేటీలో ఈ అంశంపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఈ కొత్త ఒప్పందం ప్రకారం, జపాన్‌కు చెందిన ప్రవాసేతరులు (అశీఅ–తీవంఱఎవత్ం) భారత బ్యాంకుల్లో ఖాతాలు తెరిచేందుకు అనుమతిస్తారు. దీనివల్ల ఇరు దేశాల ఆర్థిక సంస్థల మధ్య నేరుగా చెల్లింపులు జరపడం సాధ్యమవుతుంది. 2026 ఆర్థిక సంవత్సరంలోగా భారత రిజర్వ్ బ్యాంక్ (=దీ×), జపాన్ ఆర్థిక మంత్రిత్వ శాఖ మధ్య ఈ మేరకు ఒక అవగాహన ఒప్పందం కుదరనుంది. ఇరు దేశాల ప్రధానుల సంయుక్త ప్రకటనలో కరెన్సీ సహకారం అంశాన్ని చేర్చడం ఇదే మొదటిసారి కానుంది. ఈ వ్యవస్థ అందుబాటులోకి వస్తే విదేశీ మారకం, రెమిటెన్స్ ఛార్జీలు గణనీయంగా తగ్గుతాయి. మూడో దేశంలోని కరస్పాండెంట్ బ్యాంకుల ద్వారా లావాదేవీలు జరపాల్సిన అవసరం లేకపోవడంతో సమయం కూడా ఆదా అవుతుంది. తద్వారా భారత్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న జపాన్ కంపెనీలకు ప్రయోజనం చేకూరడమే కాకుండా, ప్రైవేట్ పెట్టుబడులు కూడా పెరిగేందుకు దోహదపడుతుంది. 2025 నాటి భారత్–జపాన్ జాయింట్ విజన్‌లో ఈ కరెన్సీ సహకారం గురించి ప్రస్తావించారు. ఇప్పటికే జపాన్ ఇండోనేషియాతో ఇలాంటి ఒప్పందం కుదుర్చుకోగా, మలేషియాతోనూ చర్చలు జరుపుతోంది. అంతర్జాతీయ వాణిజ్యంలో డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకునే ప్రయత్నాల్లో భాగంగా ఈ చర్యను చూస్తున్నారు.

## గ్రామ పంచాయతీలదే కీలక పాత్ర



గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనకు ఉద్దేశించిన వికసిత్ భారత్– గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ) చట్టం–వీబీజీ రామ్‌జీ యాక్ట్– 2025 ఈ జులై 1 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రాబోతుంది. ప్రస్తుతం అమల్లో ఉన్నటువంటి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలోనే ఈ కొత్త వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తోంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రకారం కొత్త చట్టం కింద అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఏడాదికి 100 రోజులకు బదులుగా 125 రోజుల వేతన ఉపాధికి చట్టబద్ధ హామీ లభిస్తుంది. ఈ పథకం అమలుకు అవసరమైన పరిపాలనా, ఆర్థిక, సాంకేతిక ఏర్పాట్లు పూర్తయ్యాయని కేంద్రం తెలిపింది. అయితే ఈ పథకం మార్పుపై కాంగ్రెస్ పార్టీతో సహా గ్రామీణ ఉపాధి హక్కుల కార్యకర్తలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. కొత్త విధానం అమలు కోసం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు రూ. 95,692.31 కోట్ల మేర తాత్కాలిక నిధులు కేటాయించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. దీంతో కొత్త వ్యవస్థలో అంతా సజావుగా జరిగి, కార్మికులకు వేతనాలు కూడా ఆలస్యం కాకుండా అందుతాయని పేర్కొంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ– 'పనిచేయాలనుకునే ఒక్క అర్హుడైన గ్రామీణ కార్మికుడు కూడా ఉపాధి లేకుండా ఉండకూడదనేదే ప్రభుత్వ లక్ష్యం' అని చెప్పారు. కేంద్రం, రాష్ట్రాలు కలిసి ఈ చట్టం అమలుకు పూర్తి స్థాయిలో సిద్ధమయ్యాయని ఆయన పేర్కొన్నారు.

**గ్రామ పంచాయతీలదే కీలక పాత్ర**

ప్రస్తుతం ఈ– కేవైసీ ధ్రువీకరణ పొందిన జాబ్ కార్డులు, కొత్త గ్రామీణ రోజ్‌గార్ గ్యారంటీ కార్డులు జారీ అయ్యే వరకు చెల్లుబాటులోనే ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే గ్రామ పంచాయతీలే పథకం అమలులో ప్రధాన పాత్ర పోషిస్తాయని తెలిపింది. నీటి సంరక్షణ, సహజ వనరుల అభివృద్ధి, వ్యవసాయం, గ్రామీణ మౌలిక వసతులు, మహిళా సాధికారత వంటి పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొంది. మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం 29 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఇప్పటికే బడ్జెట్ కేటాయించగా, 24 రాష్ట్రాలు తమ రాష్ట్ర స్థాయి ఎదీ– + =ూవీ + పథకాల నోటిఫికేషన్లు జారీ చేశాయి.

**రాష్ట్రాలపైనే భారం మోపుతున్న కేంద్రం: కాంగ్రెస్ విమర్శలు**

కొత్త వీబీ జీ రామ్ జీ చట్టంపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా విమర్శలు చేసింది. కొత్త పథకాన్ని తీసుకొచ్చారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. లోక్‌సభలో ఇచ్చిన సమాచారం ప్రకారం 2026 మార్చి నాటికి రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు రూ. 17144.13 కోట్ల ఎంజీనరేగా బకాయిలు చెల్లించాల్సి ఉందని, దీంట్లో రూ. 7846.25 కోట్లు కార్మికుల వేతన బకాయిలే ఉన్నాయని తెలిపారు. కర్ణాటక, ఝార్ఖండ్, తెలంగాణ, తమిళనాడు వంటి రాష్ట్రాలకు కోట్లల్లో బకాయిలు విడుదల కాలేదని ఖర్గే ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో వీ+చీ=జు+ూ లో కార్మికుల వేతన వ్యయాల్ని కేంద్రమే పూర్తిగా భరించేదని, ఇప్పుడు కొత్త పథకంలో మొత్తం వ్యయంలో 40 శాతం భారాన్ని రాష్ట్రాలపైనే మోపుతున్నారని విమర్శలు గుప్పించారు. ఖరీఫ్ వ్యవసాయ సీజన్‌లో 60 రోజుల బ్లాక్ అవుట్ నిబంధన వల్ల గ్రామీణ కార్మికులు తీవ్రంగా నష్టపోతారని, దీనిని పునఃసమీక్షించాలని పలు రాష్ట్రాలు కోరుతున్నట్లు ఖర్గే తెలిపారు. ఇంకా రోజువారీ కూలీని రూ. 400 కు పెంచాలని కాంగ్రెస్ మరోసారి డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం మాత్రం ఈ ఆరోపణల్ని ఖండిస్తోంది. వీబీ జీ రామ్ జీ యాక్ట్ గ్రామీణ జీవనోపాధిని మరింత బలోపేతం చేస్తుందని, ఉపాధి అవకాశాల్ని పెంచడంతో పాటుగా గ్రామీణ ఆస్తుల సృష్టికి దోహదపడుతుందని స్పష్టం చేసింది. ఈ కొత్త చట్టం జాతీయ స్థాయిలో ప్రారంభ కార్యక్రమం జులై 2న ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా ఓబులవారిపల్లె మండలం ముక్కవారిపల్లి గ్రామంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గ్రామీణ రోజ్‌గార్ గ్యారంటీ కార్డుల పంపిణీతో పాటుగా పథకంపై అవగాహన కార్యక్రమాలు కూడా చేపట్టనున్నారు.

# ప్రజల జీవితాల్లో మార్పే లక్ష్యంగా

కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, ఆయా శాఖల కార్యదర్శులతో ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం రోజు సేవా తీర్థ్‌లో కీలక సమావేశం నిర్వహించారు. దేశంలో పరిపాలనా సంస్కరణల్ని వేగవంతం చేయడం, వ్యాపారాలకు అనుకూల వాతావరణాన్ని మరింత మెరుగుపర్చడం, ప్రజలకు ప్రభుత్వ సేవల్ని సులభతరం చేయడం వంటి అంశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. అలాగే ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాల్ని ముందుకు తీసుకెళ్లడం, వేగంగా అమలు చేయడం కూడా ఈ 4 గంటల ఉన్నత స్థాయి సమావేశంలో చర్చకు వచ్చింది. సమావేశంలో ప్రధానంగా రెండు అంశాలపై సమీక్ష నిర్వహించారు. మొదటిది 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఈజ్ ఆఫ్ లివింగ్ కోసం డీ– రెగ్యులేషన్ (అనవసర నిబంధనల సరళీకరణ), ఇతర పరిపాలనా సంస్కరణలు' అంటే అంటే వ్యాపార నిర్వహణను మరింత సులభతరం చేయడం సహా పౌరుల రోజువారీ జీవన ప్రమాణాల్ని మెరుగుపర్చడం. ఇక రెండోది 'ఆత్మనిర్భర్ భారత్‌ను బలోపేతం చేయడం'. వివిధ రంగాల్లో స్వయం సమృద్ధి సాధించడం ద్వారా విదేశీ ఉత్పత్తులపై ఆధారపడటాన్ని తగ్గించడం. ఈ సందర్భంగా వివిధ మంత్రిత్వ శాఖల కార్యదర్శులు తమ శాఖలు చేపడుతున్న సంస్కరణలు, ప్రభుత్వ విధానాల అమలు, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు తీసుకుంటున్న చర్యలను ప్రధానికి వివరించారు. ప్రధాని విజన్‌ను కార్యచరణగా మార్చేందుకు చేపడుతున్న కార్యక్రమాలు, వివిధ రంగాల్లో ఎదురవుతున్న సవాళ్లు, వాటి పరిష్కారానికి రూపొందించిన భవిష్యత్తు వ్యూహాల్ని కూడా వివరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ– ప్రభుత్వ శాఖలు విడివిడిగా కాకుండా పరస్పర సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.



మొత్తం ప్రభుత్వ యంత్రాంగం ఒకే లక్ష్యంతో పనిచేసే విధానాన్ని అమలు చేయాలని సూచించారు. శాఖల మధ్య ఉన్న అడ్డంకుల్ని తొలగించి, సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగితే ప్రభుత్వ పనితీరు మరింత సమర్థవంతంగా ఉంటుందన్నారు ప్రధాని.

**ప్రభుత్వ పథకాల అమలు– ప్రజల జీవితాల్లో మార్పుపై దిశానిర్దేశం**

వివిధ శాఖల మధ్య సమన్వయం, సమాచార మార్పిడి, డేటా ఆధారిత నిర్ణయాల కోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పీఎం గతిశక్తి ప్లాట్‌ఫారంను మరింత విస్తృతంగా వినియోగించాలని ప్రధాని సూచించారు. ఈ వేదిక ద్వారా మౌలిక సదుపాయాల ప్రణాళిక, ప్రాజెక్టుల సమన్వయం, వేగవంతమైన నిర్ణయాలు తీసుకోవడం మరింత సులభతరమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల విజయాన్ని కేవలం అవి అమలవుతున్నాయా లేదా అన్నదానితో కాకుండా వాటి వల్ల ప్రజల జీవితాల్లో ఎంత మార్పు వచ్చిందనే దానితోనే అంచనా వేయాలని ప్రధాని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో కేబినెట్ సెక్రటరీ టీవీ సోమనాథన్, ప్రధాన మంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ పీకే మిశ్రా, ప్రిన్సిపల్ సెక్రటరీ, ఆర్బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్ తదితరులు పాల్గొన్నారు. ఇది 2026–27 ఆర్థిక సంవత్సరంలో ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన మొట్టమొదటి పూర్తి స్థాయి కార్యదర్శుల స్థాయి సమావేశంగా తెలుస్తోంది. 2026 రెండో అర్థభాగానికి సంబంధించి ప్రభుత్వ విధానపర నిర్ణయాలు, ప్రాధాన్యతలకు అనుగుణంగా అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేసుకోవడం కూడా సమావేశం ఉద్దేశంగా తెలుస్తోంది.

**మోదీ విజన్ లక్ష్యాలకు అనుగుణంగా– దీర్ఘకాలిక సంస్కరణలపై దృష్టి**

ఇక తాజా సమావేశంలో జరిగిన చర్చలు జూన్ 21న జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించిన సంస్కరణల కార్యచరణకు కొనసాగింపుగా నిలిచాయి. అప్పుడు కూడా ఈజ్ ఆఫ్ లివింగ్, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మరింత మెరుగుపర్చడంతో పాటుగా యువతకు ఎక్కువ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మోదీ చెప్పారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యే నాటికి (2047, ఆగస్ట్ 15) అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను నిలబెట్టాలన్న మోదీ దార్శనికతలో భాగంగా ప్రభుత్వం దీర్ఘకాలిక సంస్కరణలపై దృష్టి సారిస్తున్న తరుణంలో ఈ మీటింగ్ జరిగింది. మరోవైపు పశ్చిమాసియా ఉద్రిక్తతలు, చమురు మార్కెట్లలో అస్థిరత వంటి ప్రతికూలతలు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ బలమైన పనితీరును కనబరుస్తున్న నేపథ్యంలో ఈ సమావేశం జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# రక్షణ పరిశ్రమలో జరుగుతున్న పనులు ప్రశంసనీయం

బలమైన ఆర్థిక వ్యవస్థ, అత్యాధునిక సాంకేతిక సామర్థ్యం, పటిష్ఠమైన జాతీయ భద్రత ఈ మూడూ ఒక గొప్ప దేశానికి మూలస్తంభాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. గుజరాత్‌లోని వడోదరలో మంగళవారం నిర్వహించిన వైబ్రంట్ గుజరాత్ ప్రాంతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వైబ్రంట్ గుజరాత్ వేదిక గత రెండు దశాబ్దాల్లో గుజరాత్ అభివృద్ధికే కాకుండా దేశవ్యాప్తంగా వికసిత్ భారత్ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లే ఉద్యమంగా మారిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనను కూడా తాను సందర్శించినట్లు రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. పరిశ్రమలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు), గిరిజన ఉత్పత్తులు, భారీ పరిశ్రమలు, రక్షణ రంగానికి సంబంధించిన అనేక విభాగాలు ఇందులో పాల్గొనడం సంతోషకరమన్నారు. ముఖ్యంగా రక్షణ పరిశ్రమలో జరుగుతున్న పనులు ప్రశంసనీయమని చెప్పారు. దేశంలో ప్రైవేటు పరిశ్రమలు మరింత అభివృద్ధి చెందేందుకు అనుకూల వాతావరణాన్ని కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

**మోదీ కూడా ఈ నేల నుంచే!**

గుజరాత్ దేశానికి ఎన్నో గొప్ప నాయకులను అందించిందని రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు. మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభభాయ్ పటేల్ వంటి మహానుభావులతో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఈ నేల నుంచే ఎదిగారని చెప్పారు. మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత ప్రపంచ వేదికపై భారత ప్రతిష్ఠ మరింత పెరిగిందని అన్నారు. అంతర్జాతీయ వేదికల్లో భారత్ మాట్లాడితే ప్రపంచ దేశాలు ఆసక్తిగా వినే పరిస్థితి ఏర్పడిందని, దీనికి నరేంద్ర మోదీ నాయకత్వమే కారణమని పేర్కొన్నారు. వైబ్రంట్ గుజరాత్ కార్యక్రమం 2003లో అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీ ప్రారంభించారని రాజ్‌నాథ్ సింగ్ గుర్తుచేశారు. అప్పట్లో పెట్టుబడులను ఆకర్షించడం, పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహించడం లక్ష్యంగా ప్రారంభమైన ఈ వేదిక, ఇప్పుడు దేశ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్న పెద్ద ఉద్యమంగా రూపాంతరం చెందిందన్నారు. గత 20 ఏళ్లలో గుజరాత్‌లో అనూహ్యమైన మార్పులు చోటుచేసుకున్నాయని, ప్రస్తుతం దేశ ఆర్థికాభివృద్ధికి గుజరాత్ గ్రోత్ ఇంజిన్‌గా నిలుస్తోందని వ్యాఖ్యానించారు. తాను రక్షణ మంత్రిగా వైబ్రంట్ గుజరాత్ సదస్సుకు రావడంపై కొందరికి సందేహాలు రావొచ్చని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. అయితే



ఆర్థికాభివృద్ధి, జాతీయ భద్రత రెండూ విడదీయరాని అంశాలని స్పష్టం చేశారు. బలమైన ఆర్థిక వ్యవస్థ ఉంటేనే దేశ భద్రత మరింత పటిష్ఠంగా ఉంటుందని తెలిపారు. అలాగే రక్షణ రంగం అభివృద్ధి అంటే కేవలం ఆయుధాల తయారీ మాత్రమే కాదని, దాని ద్వారా అనేక అనుబంధ పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, సాంకేతిక రంగం కూడా వేగంగా అభివృద్ధి చెందుతాయని వివరించారు. దేశంలో ఏర్పాటు చేస్తున్న రక్షణ కారిడార్లు కొత్త పరిశ్రమలకు అవకాశాలు కల్పిస్తున్నాయని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. వీటి ద్వారా తయారీ రంగం విస్తరించడంతో పాటు యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక రంగంలో వేగంగా మార్పులు జరుగుతున్న నేపథ్యంలో భారత పరిశ్రమలు కూడా కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుని మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు.

**ఒకదానితో ఒకటి అనుసంధానమై!**

గొప్ప దేశాలు మూడు ప్రధాన ఆధారాలపై నిలబడతాయని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మొదటిది బలమైన ఆర్థిక వ్యవస్థ, రెండోది సాంకేతిక సామర్థ్యం, మూడోది జాతీయ భద్రత అని వివరించారు. ఈ మూడు పరస్పరం ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉంటాయని చెప్పారు. ఆర్థికంగా బలమైన దేశం సాంకేతికంగా కూడా ముందంజలో ఉంటుందని, అలాంటి దేశంలో భద్రత మరింత పటిష్ఠంగా ఉంటుందని పేర్కొన్నారు. అదే సమయంలో జాతీయ భద్రత బలంగా ఉన్నప్పుడు పరిశ్రమలు, ఆవిష్కరణలు, పెట్టుబడులు మరింత వేగంగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. ప్రస్తుతం ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిస్థితులు వేగంగా మారుతున్నాయని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రానున్న దశాబ్దాల్లో ప్రపంచ వేదికపై భారత్ పోషించే పాత్ర దేశ స్వావలంబన, సాంకేతిక సామర్థ్యం, ప్రజల సమష్టి సంకల్పంపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రభుత్వం అన్ని రంగాల్లో సంస్కరణలు చేపడుతోందని, పరిశ్రమలు, స్టార్టప్‌లు, రక్షణ తయారీ, సాంకేతిక రంగాలు కలిసి పనిచేస్తే భారత్ ప్రపంచంలో మరింత శక్తిమంతమైన దేశంగా ఎదుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. వైబ్రంట్ గుజరాత్ వేదిక కేవలం పెట్టుబడుల సదస్సుగా మాత్రమే కాకుండా దేశ అభివృద్ధికి దిశానిర్దేశం చేసే వేదికగా మారిందని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ప్రభుత్వం, పరిశ్రమలు, యువ పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నిపుణులు కలిసి పనిచేస్తే వికసిత్ భారత్ లక్ష్యాన్ని నిర్ణీత సమయంలోనే సాధించగలమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# జూలై 1 నుంచి రాబోతున్న మార్పులివే..

## రైల్వేస్, గ్యాస్, ఆధార్, పాస్‌పోర్ట్‌లలో కీలక మార్పులు

కేంద్ర ప్రభుత్వం తన పాలసీలలో ఎప్పటికప్పుడు మార్పులు చేస్తుంది. ప్రభుత్వంతోపాటు రైల్వేలాంటి ప్రభుత్వ రంగ వ్యవస్థల్లో నిరంతరం మార్పులు జరుగుతుంటాయి. విధానాల్లో మార్పులతోపాటు ధరల్లోనూ మార్పులు చోటు చేసుకుంటాయి. ఇవి ఎక్కువగా ప్రతి నెలా 1వ తేదీ నుంచి అమలవుతాయి. ఈ నేపథ్యంలో జూలై 1 నుంచి వివిధ అంశాల్లో పాలసీల పరంగా, ధరల పరంగా రాబోతున్న కొన్ని కీలక మార్పులివి.

**ఆధార్–ఈమెయిల్ అప్‌డేట్ ఉచితం**

ఆధార్‌తో ఈ మెయిల్ అప్‌డేట్ చేసుకోవడం ఇకపై ఉచితం. ఆధార్‌తో ఈ మెయిల్ లింక్ చేసుకోవడం లేదా అప్‌డేట్ చేసుకోవడాన్ని ఉచితం చేస్తూ 'ద యునిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యుఐడీఏఐ)' నిర్ణయం తీసుకుంది. గతంలో దీనికి రూ.75 ఛార్జీ వసూలు చేసేవారు. ఇప్పుడు జూలై 1 నుంచి డిసెంబర్ 31 వరకు ఉచితంగా ఈ సర్వీస్ వాడుకోవచ్చు. అయితే, కొత్త ఆధార్ యాప్ ద్వారా మాత్రమే ఇది సాధ్యం. వేరే మార్గాల్లో అప్‌డేట్ చేసుకుంటే నిర్దిష్ట రుసుము చెల్లించాల్సిందే.

**పాస్‌పోర్ట్ ధరల పెంపు**

జూలై 1 నుంచి పాస్‌పోర్ట్ ఫీజుల్ని కేంద్రం పెంచింది. 14 ఏళ్ల తర్వాత ఈ ఫీజుల ధరల్ని కేంద్రం సవరించింది. దీని ప్రకారం.. 36 పేజీల సాధారణ పాస్‌పోర్ట్‌కు గతంలో రూ.1,500 ఫీజు ఉండగా, ఇప్పుడు రూ.2,500 చెల్లించాలి. తత్కాల్ పాస్‌పోర్ట్‌కు గతంలో రూ.3,500 ధర ఉండగా, ఇప్పుడు రూ.5,000 చెల్లించాలి. ఇతర ఫీజుల్లో కూడా మార్పులు చేసింది.

**రైళ్లలో టిక్కెట్ లేకుంటే ఫీజు రెట్టింపు**

రైళ్లలో టిక్కెట్ లేకుండా చేసే ప్రయాణానికి సంబంధించి ఫీజును కూడా రైల్వే శాఖ రెట్టింపు చేసింది. టిక్కెట్ లేకుండా ప్రయాణిస్తే ఇంతకుముందు రూ.250 ఫీజు ఉండేది. ఇప్పుడు రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. రైల్వేస్ యాక్ట్ 1989లోని సెక్షన్ 137, సెక్షణ్ 138లను సవరిస్తూ తీసుకొచ్చిన జన్ విశ్వాస్ (అమెండ్‌మెంట్) యాక్ట్, 2026 ప్రకారం ఈ



మార్పుచేసింది. అయితే, రైల్వేల్లో టిక్కెట్ లేకుండా ప్రయాణిస్తే కోర్టులు విధించే శిక్షల్లో ఏ మార్పులు లేవు. అవి ఆరు నెలల వరకు జైలు శిక్ష. అలాగే, రూ.1,000 జరిమానా.

**క్రెడిట్ కార్డ్ రూల్స్‌లో మార్పు**

ఫోన్‌పే ఎస్బీఐ క్రెడిట్ కార్డు రివార్డ్స్‌కు సంబంధించి రూల్స్‌ను ఎస్బీఐ మార్చేసింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కూడా రిగాలియా గోల్డ్ క్రెడిట్ కార్డుకు సంబంధించి మార్పులు చేసింది. ఈ రూల్స్ ప్రకారం.. డొమెస్టిక్ ఎయిర్‌పోర్ట్ లాంజ్‌లో యాక్సెస్ కావాలంటే గడిచిన మూడు నెలల్లో రూ.60,000 స్పెండ్ చేసి ఉండాలి.

**చమురుపై ఆంక్షలు తొలగింపు**

పశ్చిమాసియా సంక్షోభం సందర్భంగా దేశంలో చమురు వినియోగంపై కేంద్రం ఆంక్షలు విధించింది. ఒక భారీ వాహనానికి రోజుకు గరిష్టంగా 200 లీటర్ల చమురు మాత్రమే పోయాలి. అలాగే, ఇండస్ట్రియల్, కమర్షియల్ అవసరాలకు వాడే చమురుపై కూడా ఆంక్షలు విధించింది. వీటిని జూలై 1 నుంచి తొలగించనుంది.

**గ్యాస్ ధరల్లో మార్పు**

ఎల్పీజీ, సీఎన్‌జీ, పీఎన్‌జీ, ఏటీఎఫ్ చమురు ధరల్ని కేంద్రం సవరిస్తుంది. జూలై 1న కొత్త ధరల్ని ప్రకటిస్తారు. దీనికి అనుగుణంగా కొత్త ధరలు అమలవుతాయి. కొంతకాలంగా వీటి ధరలు పెరుగుతూ వచ్చాయి. ఈసారి మాత్రం ధరల్ని తగ్గిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకునే ఛాన్స్ ఉంది.

**పెరగనున్న వాహనాల ధరలు**

జూలై 1 నుంచి అనేక వాహనాల ధరలు పెరుగుతాయి. పలు ప్యాసింజర్ వాహనాల ధరలు 1.5 శాతం పెంచుతున్నట్లు టాటా మోటార్స్ ప్రకటించింది. అలాగే, వాణిజ్య వాహనాల ధరల్ని 2.5 శాతం పెంచబోతున్నట్లు తెలిపింది. కియా మోటార్స్ కూడా తమ వాహనాల ధరల్ని 2 శాతం పెంచనుంది

# నష్టాల్లో ముగిసిన భారత స్టాక్ మార్కెట్.. సెన్సెక్స్ 250 పాయింట్లు పతనం

భారత స్టాక్ మార్కెట్ మంగళవారం నష్టాల్లో ముగిసింది. మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగియడం వరుసగా ఇది రెండోసారి. బీఎస్ఈ సెన్సెక్స్ 249 పాయింట్లు, ఎన్ఎస్ఈ నిఫ్టీ 80 పాయింట్లు నష్టపోయాయి. బీఎస్ఈ సెన్సెక్స్ ఉదయం 77,005.51 వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. ఒక దశలో 77,037.36 పాయింట్ల గరిష్టాన్ని తాకింది. చివరకు ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 249.70 పాయింట్లు (0.30) నష్టపోయి 76,478.67 వద్ద నిలిచింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ50 80.50 పాయింట్లు (0.34%) నష్టపోయి 23,865.75 వద్ద ముగిసింది. ఐటీ స్టాక్స్ ఒత్తిడికి గురికావడం, అమెరికాకు చెందిన ఎకనామిక్ డాటా, ఫెడరల్ రిజర్వ్ ఇంటరెస్ట్ రేట్, ఇరాన్, అమెరికా మధ్య ఒప్పందం నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. సెన్సెక్స్ సూచీలో టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, ఐటీసీ, హిందుస్థాన్ లీవర్ షేర్లు భారీగా నష్టపోయాయి. మరోవైపు బజాజ్ ఫైనాన్స్, ఎటర్నల్, అదానీ పోర్ట్స్, టైటాన్, మారుతి సుజుకి సంస్థల షేర్లు లాభపడ్డాయి. వీటిలో మారుతి సుజుకి షేర్లు ఏకంగా 5 శాతం లాభపడ్డాయి. నిఫ్టీలో స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 73.25 డాలర్లుగా ఉంది. మరోవైపు రూపాయి విలువ స్వల్పంగా క్షీణించింది. డాలర్‌తో రూపాయి



విలువ 94.66 వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,025.73 డాలర్లుగా ఉంది.

## బిజినెస్

### పసిడి ప్రియులకు షాక్.. ఒక్కసారిగా పెరిగిన ధరలు!



బంగారం ధరల్లో ఎప్పటికప్పుడు ఊహకందని మార్పు జరుగుతున్నాయి. అయితే నేడు (మంగళవారం) పసిడి ధరల తగ్గుదలకు బ్రేక్ పడింది. దీంతో ఒక్కసారిగా గోల్డ్ రేటు పెరిగిపోయింది. ఈ కథనంలో లేటెస్ట్ ధరలు ఎలా ఉన్నాయో చూసేద్దాం. హైదరాబాద్, విజయవాడలలో ఈ రోజు (జూన్ 30) ఉదయం రూ.1,28,450 వద్ద ఉన్న 22 క్యారెట్ల తులం బంగారం ధర.. సాయంత్రానికి రూ.1,30,200 రూపాయల వద్దకు చేరింది. అంటే గంటల వ్యవధిలోనే పసిడి ధరల్లో భారీ మార్పు (రూ.1750 పెరిగింది) జరిగిందని స్పష్టమవుతోంది. 24 క్యారెట్ల ధర రూ.1,40,130 నుంచి రూ.1,42,040 (రూ.1910 పెరిగింది) వద్దకు చేరింది. ఢిల్లీలో కూడా బంగారం ధరల్లో మార్పు సంభవించింది. ఇక్కడ 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం 1,28,600 రూపాయల నుంచి రూ.1,30,350 వద్దకు, 24 క్యారెట్ల తులం గోల్డ్ రేటు రూ.1,40,280 నుంచి రూ.1,42,190 వద్దకు చేరింది. అయితే చెన్నైలో మాత్రం బంగారం ధరలు తగ్గాయి. ఇక్కడ 22 క్యారెట్ల తులం గోల్డ్ రేటు రూ.1000 తగ్గి రూ.1,32,000 వద్ద, 24 క్యారెట్ల రేటు రూ.1090 తగ్గి రూ.1,44,000 వద్ద నిలిచాయి. మొత్తం మీద దేశంలో గోల్డ్ రేటు తగ్గినట్లే తగ్గి.. మళ్లీ పెరుగుదల దిశగా అడుగులు వేయడం వల్ల, పసిడి ప్రియులలో ఆందోళన మొదలైంది. అయితే రాబర్ట్ కియోసాకి వంటి నిపుణులు మాత్రం రానున్న రోజుల్లో మరింత తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు.

### వోల్టాస్ ఛైర్మన్ పదవినుంచి వైదొలగనున్న నోయల్ టాటా

ఇంటర్నెట్ డెస్క్: టాటా గ్రూప్‌నకు చెందిన ప్రముఖ ఎయిర్ కండిషనర్ల తయారీ సంస్థ వోల్టాస్ ఛైర్మన్ బాధ్యతల నుంచి వైదొలుగుతున్నట్లు టాటా సన్స్ ఛైర్మన్ నోయల్ టాటా ప్రకటించారు. కంపెనీ 72వ వార్షిక సాధారణ సమావేశంలో తన నిర్ణయాన్ని వెల్లడించారు. ఇటీవల టాటాకు చెందిన రిటైల్ సంస్థ ట్రెంట్ ఛైర్మన్ పదవి నుంచి తప్పుకొంటున్నట్లు ప్రకటించిన ఆయన.. వారం తిరగకముందే వోల్టాస్ బాధ్యతల నుంచీ వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. "టాటా గ్రూప్ అంతర్గత పదోన్నతులు, అనుభవజ్ఞులైన ఉద్యోగుల నుంచి కొత్త తరం నాయకులను ఎంపిక చేసింది. వారి నూతన ఆలోచనలతో కంపెనీ మరింత పురోగతి సాధిస్తుంది. నా పదవీకాలంలో ఎయిర్ కండిషనర్ల మార్కెట్‌లో వోల్టాస్ అతిపెద్ద కంపెనీగా ఎదిగింది. కేవలం 81 రోజుల్లోనే 10 లక్షల యూనిట్లను విక్రయించి గొప్ప మైలురాయిని అందుకుంది. ఈ విషయంలో సంతృప్తిగా ఉంది. ఇన్నేళ్లుగా మద్దతుగా నిలిచిన వారందరికీ కృతజ్ఞతలు" అని నోయల్ అన్నారు. 2003లో జనవరి 27న వోల్టాస్ బోర్డులో నోయల్ టాటా చేరారు. 2017 సెప్టెంబర్ 1న నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. కంపెనీల నిబంధనలు, 2013 ప్రకారం 70 ఏళ్లు దాటిన వారు నిర్ణీత అనుమతులు లేకుండా మేనేజింగ్ డైరెక్టర్ లేదా హోల్ టైమ్ డైరెక్టర్‌గా కొనసాగకూడదు. ఈ ఏడాది నవంబరులో నోయల్ టాటాకు 70 ఏళ్లు నిండుతుండడంతో ఆయన నుంచి ఈ నిర్ణయం వెలువడింది.

# ఏకపక్ష పోరులో చిత్తైన వెస్టిండీస్.. ఎనిమిదోసారి ఫైనల్లో ఆస్ట్రేలియా..!



మహిళల టీ20 ప్రపంచకప్ తొలి సెమీఫైనల్లో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. ఏకపక్ష పోరులో వెస్టిండీస్ పై 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. స్వల్ప ఛేదనలో ఓపెనర్ బేత్ మూనీ(61 నాటౌట్) దూకుడుగా ఆడింది. రెండు వికెట్లు పడినా.. అర్ధశతకంతో కదం తొక్కిన మూనీ.. అష్ గార్డ్‌నర్(35 నాటౌట్)తో కలిసి విండీస్ బౌలర్లను సమర్ధంగా ఎదుర్కొంది. నాలుగోసారి సెమీస్‌లో విండీస్‌ను ఓడించిన కంగారూ టీమ్ రికార్డు స్థాయిలో ఎనిమిదోసారి ఫైనల్లో అడుగుపెట్టింది. ఐసీసీ నాకౌట్స్‌లో తిరుగులేని ఆస్ట్రేలియా మరోసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. తొలి సెమీఫైనల్లో వెస్టిండీస్‌ను వణికించిన ఆసీస్.. స్వల్ప లక్ష్యాన్ని ఆడుతూపాడుతూ ఛేదించింది. 2012లో 2014లో, 2018లో కరీబియన్ టీమ్‌ను సెమీస్‌లోనే ఇంటికి పంపిన కంగారూలు ఈసారి కూడా పైచేయి సాధించారు. 126 పరుగుల ఛేదనలో ఓపెనర్ జార్జియా వోల్(16), ఫోబే లిచ్‌ఫీల్డ్(4)లు త్వరగానే ఔటైనా.. బేత్ మూనీ(61 నాటౌట్) నిలబడింది. క్లాక్స్‌టన్ వేసిన 6వ ఓవర్లో నాలుగు ఫోర్లతో మూనీ రెచ్చిపోవడంతో.. ఆసీస్ పవర్ ప్లేలో రెండు వికెట్ల నష్టానికి 63 రన్స్ కొట్టింది. అష్ గార్డ్‌నర్(35 నాటౌట్) మరో ఎండ్‌లో యాంకర్ రోల్ పోషించగా మూనీ మైదానం నలువైపులా షాట్లతో అలరించి స్కోర్ బోర్డును ఉరికించింది. 29 బంతుల్లోనే అర్ధ శతకం సాధించిన తను.. గార్డ్‌నర్‌తో హాఫ్ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పింది. వీరిద్దరూ క్రీజులో పాతుకుపోవడంతో ఆసీస్ 8 వికెట్ల తేడాతో గెలుపొందింది.


**ఓపెనర్ల తడబాటు**

భారీ స్కోర్ కొట్టాలనుకున్న వెస్టిండీస్‌కు ఆస్ట్రేలియా బౌలర్లు షాకిచ్చారు. టాస్ ఓడి ఇన్నింగ్స్ దూకుడుగా ఆరంభించినా హేలీ మాథ్యూస్(30)ను ఆసీస్ స్పిన్నర్లు సమర్థంగా నిలువరించారు. నాలుగో ఓవర్లో కిమ్ గార్త్, ఐదో ఓవర్లో లూయిస్ హామిల్టన్ ఒక్కో పరుగే ఇచ్చారు. మరో ఎండ్‌లో క్వియానా జోసెఫ్(16).. తడబాటుతో పవర్ ప్లేలో విండీస్ 35 రన్స్ చేసింది. ఆసీస్ బౌలర్లు వరేహం(2-17) తొలి బంతికే మాథ్యూస్(30)ను బౌల్డ్ చేసింది. 47 వద్ద తొలి వికెట్ పడగా.. క్రీజులోకి వస్తూనే షెమైనే క్యాంప్‌బెల్(22) రెండు ఫోర్లు బాదింది. కానీ, తర్వాత మొలినెక్స్ ఓవర్లో సిక్సర్‌కు యత్నించిన జోసెఫ్ నేరుగా సథర్‌లాండ్ చేతికి చిక్కింది.

**గార్డ్‌నర్ డబుల్..**

ఓపెనర్లు వెనుదిరిగిన షాక్ నుంచి తేరుకోక ముందే గార్డ్‌నర్ విండీస్‌ను మరింత ఒత్తిడికి గురి చేసింది. 11వ ఓవర్లో డేంజరస్ స్టెఫానీ టేలర్(0), క్లాక్స్‌టన్(0)ల వికెట్లు తీసి మరింత కష్టాల్లోకి నెట్టింది. ఆ దశలో చినొల్లే హెన్రీ(10) జతగా క్యాంప్‌బెల్ జట్టును ఆదుకోవాలనుకుంది. అయితే.. ఈ ఇద్దరూ త్వరగానే ఔటవ్వడంతో.. విండీస్ వందలోపే పరిమితమయ్యేలా కనిపించింది. ఆఖర్లో డియాంద్ర డాటిన్(22 నాటౌట్) మెరుపులతో స్కోర్ దాటించింది. దాంతో, నిర్ణీత ఓవర్లలో వికెట్ల నష్టానికి కరీబియన్ టీమ్ 125 రన్స్ చేయగలిగింది.

### ఓపెనర్లు ఫ్లాప్.. నత్తనడకలా వెస్టిండీస్ బ్యాటింగ్ ..!



మహిళల టీ20 ప్రపంచకప్ తొలి సెమీఫైనల్లో వెస్టిండీస్ ఓపెనర్లు విఫలమయ్యారు. బ్యాటింగ్‌కు అనువైన పిచ్‌పై ఆస్ట్రేలియా బౌలర్లు ప్రణాళికబద్ధంగా బౌలింగ్ చేస్తుండడంతో హేలీ మాథ్యూస్(30), క్వియానా జోసెఫ్(16)లు ఒత్తిడికిలోనై వికెట్ పారేసుకున్నారు. మాథ్యూస్‌ను వరేహం బౌల్డ్ చేయగా.. మొలినెక్స్ ఓవర్లో జోసెఫ్ బౌండరీ వద్ద సథర్‌లాండ్ చేతికి చిక్కింది. దాంతో, ఓవల్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్‌లో విండీస్ 10 ఓవర్లలో 58 రన్స్ మాత్రమే చేసింది. టాస్ ఓడిన వెస్టిండీస్ ఇన్నింగ్స్ దూకుడుగా ఆరంభించినా.. నాలుగో ఓవర్లో కిమ్ గార్త్, ఐదో ఓవర్లో లూయిస్ హామిల్టన్ ఒక్కో పరుగే ఇచ్చారు. మరో ఓపెనర్ క్వియానా జోసెఫ్(16).. తడబాటుతో పవర్ ప్లేలో విండీస్ 35 రన్స్ చేసింది. ఆసీస్ బౌలర్లు వరేహం() తొలి బంతికే మాథ్యూస్(30)ను బౌల్డ్ చేసింది. 47వద్ద తొలి వికెట్ పడగా.. క్రీజులోకి వస్తూనే షెమైనే క్యాంప్‌బెల్(10 నాటౌట్) రెండు ఫోర్లు బాదింది. కానీ, తర్వాత మొలినెక్స్ ఓవర్లో సిక్సర్‌కు యత్నించిన జోసెఫ్ నేరుగా సథర్‌లాండ్ చేతికి చిక్కింది.

## స్పోర్ట్స్


### టీమిండియాతో రేపే తొలి టీ20.. ఇంగ్లండ్ తుది జట్టు ప్రకటన..!




స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో టెస్టు సిరీస్ కోల్పోయిన ఇంగ్లండ్ టీ20 పోరుకు సై అంటోంది. భారత జట్టుతో ఐదు టీ20లు ఆడనుంది ఆతిథ్య జట్టు. జూలై 1 బుధవారం నుంచే ఇరుజట్ల మధ్య పొట్టి సమరం మొదలవ్వనుంది. దాంతో, మంగళవారం ఇంగ్లండ్, వేల్స్ క్రికెట్ బోర్డు తుది జట్టును ప్రకటించింది. హ్యారీ బ్రూక్ సారథిగా 11 మందితో కూడిన బృందంలో స్పిన్నర్లుగా ఆదిల్ రషీద్, లియాం డాసన్‌లు ఎంపికయ్యారు. సొంతగడ్డపై బజ్ బాల్ వ్యూహం బెడిసికొట్టడంతో న్యూజిలాండ్ చేతిలో కంగుతిన్న ఇంగ్లండ్ టీ20ల్లో భారత జట్టును ఢీకొట్టనుంది. టీమిండియాతో ఐదు మ్యాచుల సిరీస్ జూలై 1 బధువారం నుంచి మొదలవ్వనుంది. అందుకని ఆనవాయితీని కొనసాగిస్తూ.. ఒకరోజు ముందుగానే ఇంగ్లండ్, వేల్స్ బోర్డు పదకొండు మందిని ఎంపిక చేసింది. ఓపెనర్లుగా ఫిల్ సాల్ట్, జోస్ బట్లర్ .. మిడిలార్డర్‌లో కెప్టెన్ హ్యారీ బ్రూక్, జాకబ్ బెథెల్ ఆడనున్నారు. పేస్ ఆల్‌రౌండర్‌గా సాయ్ కరన్.. స్పిన్నర్లుగా డాసన్, రషీద్ ఎంపికయ్యారు. పేస్ దళంలో ల్యూక్ వుడ్, సకీబ్ మహమూద్ ఉన్నారు. ఇక.. చిన్న జట్టైన ఐర్లాండ్ చేతిలో ఊహించని విధంగా 2-0తో సిరీస్ కోల్పోయిన టీమిండియా.. ఇంగ్లండ్ గడ్డపై గర్వించదగ్గ ప్రదర్శన చేయాలనుకుంటోంది. ఇంగ్లండ్ తుది జట్టు : ఫిల్ సాల్ట్, జోస్ బట్లర్, హ్యారీ బ్రూక్(కెప్టెన్), జాకబ్ బెథెల్, టామ్ బ్యాంటన్, సాయ్ కరన్, విల్ జాక్స్, లియాం డాసన్, ఆదిల్ రషీద్, ల్యూక్ వుడ్, సకీబ్ మహమూద్.

# మళ్లీ పాత రూట్లోకి అల్లరి నరేష్..

## పుట్టినరోజు కానుకగా 'రంభ ఊర్వశి మేనక' ఫస్ట్ లుక్ రిలీజ్!



టాలీవుడ్ సీనియర్ హీరో, కామెడీ కింగ్ అల్లరి నరేష్ నేడు తన పుట్టినరోజును జరుపుకుంటున్నారు. అయితే ఈ ప్రత్యేకమైన సందర్భాన్ని పురస్కరించుకుని తన అభిమానులకు ఆయన ఒక అదిరిపోయే ట్రీట్ ఇచ్చారు. తన కెరీర్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 65వ సినిమా టైటిల్‌ను, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను అధికారికంగా ప్రకటిస్తూనే, సినిమా విడుదల తేదీని కూడా మేకర్స్ ఖరారు చేశారు. ఈ చిత్రానికి 'రంభ ఊర్వశి మేనక' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఫిక్స్ చేశారు మేకర్స్. ఈ సరికొత్త సోషియో ఫాంటసీ కామెడీ ఎంటర్‌టైనర్‌ను సెప్టెంబర్ 4, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో అత్యంత ఘనంగా విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం స్పష్టం చేసింది. గత కొంతకాలంగా సీరియస్ ఎమోషనల్ కథలతో అలరించిన నరేష్, చాలా విరామం తర్వాత మళ్లీ తన మార్క్ హిలేరియస్ ఎంటర్‌టైనర్‌తో రాబోతుండటంతో ప్రేక్షకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రానికి చంద్ర మోహన్ చింతడ దర్శకత్వం వహిస్తుండగా, హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ కలయికలో వస్తున్న మొదటి ప్రాజెక్ట్ ఇదే కావడం విశేషం. 'యముడికి మొగుడు' సినిమా తర్వాత దాదాపు 14 ఏళ్ల సుదీర్ఘ విరామం అనంతరం అల్లరి నరేష్ మళ్లీ ఒక ఫాంటసీ జానర్ వైపు అడుగులు వేస్తుండటంతో ఈ సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి "కామెడీ గోస్ కాస్మిక్" అనే ఒక క్రేజీ ట్యాగ్‌లైన్‌ను కూడా జత చేశారు, ఇది సినిమాలోని వినోద స్థాయి ఏ రేంజ్‌లో ఉండబోతోందో ముందే హింట్ ఇస్తోంది. ఇక తాజాగా విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ విషయానికి వస్తే, ఇది నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఆకాశంలో మేఘాల మధ్య దేవలోకానికి వెళ్లే మెట్లపై అల్లరి నరేష్ ఎంతో స్టైలిష్‌గా కూర్చుని ఉండటం, ఆయన చేతిలో రంభ, ఊర్వశి, మేనకల పేర్లు రాసి ఉన్న ఒక పురాతన శాసనం పట్టుకుని ఉండటం పోస్టర్‌లో కనిపిస్తోంది. అలాగే ఆయన చుట్టూ మేఘాలలో అప్సరసలు విహరిస్తున్న దృశ్యం ఫాంటసీ ఎలిమెంట్స్‌ను అద్భుతంగా ఎలివేట్ చేస్తోంది. రంగురంగుల గ్రాఫిక్స్‌తో, వైవిధ్యమైన డిజైన్‌తో ఉన్న ఈ పోస్టర్ చూస్తుంటే.. ఇంద్రలోకానికి, భూలోకానికి మధ్య జరిగే ఒక మాయాజాలం, అందులో నుంచి పుట్టే కడుపుబ్బ నవ్వించే కామెడీ, ఊహించని ట్విస్టులతో ఈ సినిమా సాగనుందని స్పష్టమవుతోంది. ఈ భారీ విజువల్ కామెడీ డ్రామాలో వెన్నెల కిషోర్, నరేష్ వికె, శ్రీనివాస్ రెడ్డి, మురళీధర్ గౌడ్ వంటి నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# ఈ సారి నమ్మండి.. నేను మాట్లాడను

టాలీవుడ్ అక్కినేని అఖిల్ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ లెనిన్. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా జూలై 3న థియేటర్లలో సందడి చేయనుంది. ఈ మూవీలో భాగ్యశ్రీ హీరోయిన్‌గా కనిపించనుంది. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో వస్తోన్న ఈ సినిమాపై అక్కినేని అభిమానుల్లో అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలోనే వైజాగ్ వేదికగా ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సందర్భంగా ఈవెంట్‌కు హాజరైన అఖిల్ ఈ మూవీపై ఆసక్తికర కామెంట్స్ చేశారు. నా సినిమా వచ్చి ఇప్పటికీ మూడేళ్లయిందని.. సారీ బ్రదర్.. ఈ విషయంలో నన్ను క్షమించాలంటూ అభిమానులను కోరారు అఖిల్. నా గుండెలపై చేయి వేసుకుని చెబుతున్నా.. ఈ సారి నేను మాట్లాడను.. కేవలం నా సినిమానే మాట్లాడుతుందన్నారు. ఇంతకుమించి నేనేం చెప్పకూడదు.. రెండు రోజులుగా నేను నిద్రపోలేదు.. కళ్లద్దాలు పెట్టుకుని వద్దామనుకున్నానని తెలిపారు. మిమల్ని చూస్తుంటే జూలై 10 వరకు పనిచేసే ఎనర్జీ వచ్చిందని అభిమానులను ఉద్దేశించి అఖిల్ మాట్లాడారు.





# రావు బహదూర్ మూవీ.. ట్రైలర్ రిలీజ్

సత్యదేవ్ హీరోగా వస్తోన్న లేటెస్ట్ సైకలాజికల్ థ్రిల్లర్ రావు బహదూర్. ఈ చిత్రానికి వెంకటేష్ మహా దర్శకత్వం వహించారు. ఈ మూవీలో దీపా థామస్ హీరోయిన్‌గా నటించింది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా జూలై 3న థియేటర్లలో సందడి చేయనుంది. గతంలో ఆయన డైరెక్ట్ చేసిన 'కేరాఫ్ కంచరపాలెం, ఉమామహేశ్వర ఉగ్రరూపస్య' చిత్రాలు టాలీవుడ్‌లో మంచి విజయాన్ని అందుకున్నాయి. ఈ చిత్రాన్ని మహేశ్ బాబు, నమ్రతా శిరోద్కర్ సొంత నిర్మాణ సంస్థ జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించారు. తాజాగా ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ మూవీ ట్రైలర్ మహేశ్ వాయిస్ ఓవర్‌తో ప్రారంభమైంది. ఈ ట్రైలర్ ట్రైలర్ చూస్తుంటే సైకలాజికల్ థ్రిల్లర్ మూవీగానే తెరకెక్కించినట్లు తెలుస్తోంది. మునుపెన్నడు చూడని తెలుగు సినిమా రావు బహదూర్ అంటూ ఒక్కసారిగా అంచనాలు పెంచేశారు మహేశ్ బాబు. కాగా.. ఈ చిత్రంలో వికాస్ ముప్పాల, బాల పరాసర్, ఆనంద్ భారతి, ప్రణయ్ వాక, కునాల్ కౌశిక్, మాస్టర్ కిరణ్ కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు స్మరణ్ సాయి సంగీతమందించారు.

# సుడిగాలి సుధీర్ సినిమా.. 'లైలం బాబు'గా శివాజీ



సుడిగాలి సుధీర్ హీరోగా ప్రసన్న కుమార్ కోట దర్శకత్వం వహిస్తున్న చిత్రం హైలెస్సో. వజ్ర వారాహి సినిమాస్ బ్యానర్‌పై శివ చెర్రీ, రవికిరణ్ నిర్మిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రంలో కోర్ట్ సినిమాలో తన ఇంటెన్స్ నటనతో ఆకట్టుకున్న శివాజీ 'లైలం బాబు' అనే పవర్‌ఫుల్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. శివాజీ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. పోస్టర్‌లో నల్లటి దుస్తులు, పంచెకట్టుతో రాతి సింహాసనంపై కూర్చొని, చేతిలో సీసా పట్టుకుని శివాజీ కనిపించిన తీరు ఆయన పాత్రలోని పవర్ ని చూపిస్తోంది. 'లైలం బాబు' పాత్రలో శివాజీ తన కెరీర్‌లోనే అత్యంత పవర్‌ఫుల్ అవతార్‌లో ప్రేక్షకులను అలరించబోతున్నారు. ఈ ఫస్ట్ లుక్ తో సినిమాపై మరింత ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో నటాషా సింగ్, నక్ష శరణ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రముఖ కన్నడ నటి అక్షర గౌడ ఈ కీలక పాత్రలో కనిపించనున్నారు. మొట్ట రాజేంద్రన్, గెటప్ శ్రీను, బెవర దుహిత శరణ్య ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు.



# పొలిటికల్ ఎంట్రీపై రాఘవ లారెన్స్ యూటర్న్.. అభిమానులకు భారీ షాక్!

నటుడు రాఘవ లారెన్స్ రాజకీయ ప్రవేశంపై గత కొద్దిరోజులుగా కోలీవుడ్‌తో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ జోరుగా చర్చ సాగుతోంది. తను ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలా వద్దా అనే నిర్ణయాన్ని పూర్తిగా తన అభిమానులకే వదిలేస్తున్నట్లు లారెన్స్ గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ పోటీ చేసి తప్పుకున్న తిరుచ్చి ఈస్ట్ (తిరుచిరాపల్లి తూర్పు) నియోజకవర్గం నుంచి లారెన్స్ బరిలోకి దిగబోతున్నారంటూ సోషల్ మీడియాలో విపరీతంగా రూమర్స్ చక్కర్లు కొట్టాయి. ఈ నేపథ్యంలో వాటన్నింటికీ అడ్డుకట్ట వేస్తూ, తన రాజకీయ భవిష్యత్తుపై లారెన్స్ ఒక అధికారిక ప్రకటనను విడుదల చేశారు. తాజాగా మంగళవారం మధ్యాహ్నం సోషల్ మీడియా వేదికగా దాదాపు 16 నిమిషాల నిడివి గల ఒక సుదీర్ఘమైన వీడియోను పోస్ట్ చేసిన లారెన్స్, తన పొలిటికల్ ఎంట్రీపై పూర్తి క్లారిటీ ఇచ్చారు. వైరల్ అవుతున్న వార్తల్లో నిజం లేదని, తాను తిరుచిరాపల్లి తూర్పు నియోజకవర్గం నుండి పోటీ చేయడం లేదని ఆయన స్పష్టం చేశారు. అయితే అంతటితో ఆగకుండా, తాను ఎన్నికల్లో పోటీ చేయనంత మాత్రాన రాజకీయాల్లోకి రానని అనుకోవద్దని వ్యాఖ్యానించాడు. ప్రస్తుతం తన పూర్తి ఫోకస్ కేవలం సినిమాలపైనే ఉందని, ఒప్పుకున్న ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడమే తన మొదటి ప్రాధాన్యతని వివరించారు. తాను ప్రత్యక్షంగా ఎన్నికల్లో నిలబడకపోయినా, తన ట్రస్ట్ ద్వారా సమాజానికి చేసే సేవలు మరియు సహాయ కార్యక్రమాలు ఎప్పటిలాగే నిరంతరాయంగా కొనసాగుతాయని ఈ కాంచన హీరో వెల్లడించారు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s SAI KRISHNA PUBLICATIONS, Owned by M/s SAI KRISHNA PUBLICATIONS, Printed at – Sree Seshasai Enterprises, Plot No.98/1, Co-operative Industrial Estate, IDA Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District, Telangana. Published at H.No.3-5-182, Kotagally, Ushaprasad Multiplex back side, Nizambad District-503001, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2010/35558 Phone No. 9440231967